విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189



# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET

MANA VAARTHA

Telangana సంపుటి: 1, సంచిక: 196 | volume: 1, Issue: 196 | శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 పేజీలు : 8 వెల : 3.00


## గ్రామ పంచాయతీలకు రూ.646.46 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల



**హైదరాబాద్:** తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యాయి. వారం రోజుల క్రితం తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల కాగా, తాజాగా మరో విడతగా రూ.387 కోట్లు విడుదలయ్యాయి. దీంతో రెండు విడతల్లో కలిపి మొత్తం రూ.646.46 కోట్ల నిధులు గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమయ్యాయి. ఈ నిధులతో గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతం లభించనుంది. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు వంటి అవసరాలకు ఈ నిధులు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంకా కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.2,400 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండటానికి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి విడతలవారీగా నిధులు విడుదలవుతున్నాయి. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు సజావుగా కొనసాగేందుకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది.

## కార్పొరేషన్ ఎన్నికల్లో గులాబీ జెండానే ఎగురుతుంది కేటీఆర్



**హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్ని కార్పొరేషన్లు చేసినా గెలిచేది గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరగా, కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు వెళ్లినా పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా కార్యకర్తలు మాత్రం కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచిందని, 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా తమకుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలతో అధికారం దక్కించుకుందని, బీజేపీ తెలంగాణకు పనికిరాని పార్టీగా మారిందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, వ్యాపారాలు కుదేలయ్యాయని ఆరోపించారు. త్వరలో కార్పొరేషన్ ఎన్నికల దృష్ట్యా డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేలు లేకపోయినా కార్యకర్తలకు అండగా తాను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటామని హామీ ఇచ్చారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువ నాయకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో 44 వేలకుపైగా

## జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

- ప్రక్రియ మరింత పారదర్శకంగా అర్హులందరికీ న్యాయం...
- సవరణలతో కార్డుల సంఖ్యలో భారీ పెరుగుదల...
- మీడియా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబాటు...

**హైదరాబాద్, ఫిబ్రవరి 12 :** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం పట్ల పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై సచివాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో జి మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు అవసరమైన దిశానిర్దేశాలు చేశారు.




ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేయగా, అనంతరం జర్నలిస్టు సంఘాల సూచనల మేరకు సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. తాజా సవరణలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే కార్డులు ఉండగా, ఇప్పుడు దాదాపు 21 వేలకుపైగా అదనంగా కార్డులు మంజూరు అవుతాయని వివరించారు. 2.50 లక్షలకుపైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుంచి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న 24 పత్రికలకు 17,784 కార్డులు, 25,001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390 కార్డులు మంజూరు అవుతాయని తెలిపారు. అదేవిధంగా 15,001 నుంచి 25,000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 కార్డులు, 15 వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226 కార్డులు, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజెన్సీలకు 68 అక్రిడిటేషన్లు ఇస్తామని చెప్పారు. 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానళ్లకు 32, 100 లోకల్ కేబుల్ ఛానళ్లకు 200, డిజిటల్ మీడియాకు 10 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో 16,056 కార్డులు, నియోజకవర్గ, మండల స్థాయిలో 28,650 కార్డులు మంజూరు అవుతాయని వివరించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అవసరమైతే మరిన్ని సవరణలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## సింగరేణి చైర్మన్‌గా డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ బాధ్యతల స్వీకారం



**హైదరాబాద్:** సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ తెలంగాణ కేడర్‌కు చెందిన డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గతంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు ప్రభుత్వ కార్యదర్శిగా సేవలందించారు. రవాణా, భూమి రికార్డులు, సామాజిక సంక్షేమ రంగాల్లో విస్తృత అనుభవం కలిగి ఉన్నారు. రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్, సర్వే సెటిల్మెంట్లు మరియు ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్, భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్ వంటి కీలక బాధ్యతలు నిర్వహించారు. సింగరేణి సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని ఆయన బాధ్యతల స్వీకారం సందర్భంగా తెలిపారు.

## రూ. 3.60 లక్షల కోట్ల రక్షణ ప్రతిపాదనలకు ఆమోదం



**న్యూఢిల్లీ:** కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన రక్షణ కొనుగోలు మండలి సమావేశంలో సుమారు రూ. 3.60 లక్షల కోట్ల అంచనా వ్యయంతో వివిధ రక్షణ ప్రతిపాదనలకు 'అవసర ఆమోదం' లభించింది. ఈ నిర్ణయం దేశ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలకంగా భావిస్తున్నారు. భారత వాయుసేన కోసం బహుళ విధుల యుద్ధ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ఇందులో రఫేల్ యుద్ధ విమానాలు, యుద్ధ క్షిపణులు, గగన నౌకల ఆధారిత అధిక ఎత్తులో దీర్ఘకాల నిఘా వ్యవస్థలు ఉన్నాయి. వీటి ద్వారా వాయుసేన దాడి, రక్షణ సామర్థ్యాలు మరింత పెరగనున్నాయి. భారత భూసేన కోసం యాంటీ ట్యాంక్ మైన్స్ 'విభవ్', ఆర్మర్డ్ రికవరీ వాహనాలు, టీ-72 ట్యాంకులు, బీఎంపీ-2 ఇన్ఫెంట్రీ కాంబాట్ వాహనాల పునరుద్ధరణకు ఆమోదం ఇచ్చారు. ఈ నిర్ణయాలు దేశ రక్షణ సామర్థ్యాలను ఆధునికీకరించి, భూభాగం, గగనం, సముద్రంలో సమగ్ర భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక మైలురాయిగా భావిస్తున్నారు.

## రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు కేంద్రం ఆమోదం



**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధవిమానాల సంఖ్యను పెంచుకోవాలని భారత్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ దేశం నుంచి అదనంగా యుద్ధవిమానాలను కొనుగోలు చేసే ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.3.25 లక్షల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్‌తో భారీ రక్షణ ఒప్పందం కుదుర్చుకునేందుకు అనుమతి లభించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని రక్షణ కొనుగోలు మండలి 114 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ నెల 18న భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. కొనుగోలు చేయనున్న 114 యుద్ధవిమానాల్లో 88 ఒకే సీటు వేరియంట్లు, 26 రెండు సీట్ల వేరియంట్లు ఉంటాయి. ఇప్పటికే భారత వాయుసేన వద్ద 36 రఫేల్ యుద్ధవిమానాలు సేవలో ఉన్నాయి. దేశీయ తయారీకి ప్రాధాన్యం ఇస్తూ ఈ ఒప్పందాన్ని అమలు చేయనున్నారు. రఫేల్ తయారీ సంస్థ దసో ఏవియేషన్ భారతదేశంలోని ప్రైవేటు సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని తయారీ, అసెంబ్లీ కార్యకలాపాలు చేపట్టే అవకాశముందని సమాచారం. దీంతో దేశ రక్షణ సామర్థ్యం మరింత బలోపేతం కానుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## ఐక్య పోరాటాలతో కేంద్ర ప్రభుత్వ కార్మిక,రైతు,ప్రజా వ్యతిరేక విధానాలను త్రిప్పికొడదాం




**-ట్రేడ్ యూనియన్ సెంటర్ అఫ్ ఇండియా(టియుసిఐ) రాష్ట్ర సహాయకార్యదర్శి ఆర్ రమేష్ పిలుపు...**

**నిజామాబాద్ జిల్లా సిరికొండ( మన వార్త) ఫిబ్రవరి 12**సిరికొండ మండలంలో జాతీయ సార్వత్రిక సమ్మె విజయవంతం కేంద్రం తెచ్చిన 4 లేబర్ కోర్డ్స్ ప్రతుల దగ్ధం.ఐక్య పోరాటాలతో కేంద్ర ప్రభుత్వ కార్మిక,రైతు,ప్రజా వ్యతిరేక విధానాలను త్రిప్పికొడదామని ట్రేడ్ యూనియన్ సెంటర్ అఫ్ ఇండియా(టియుసిఐ) రాష్ట్ర సహాయకార్యదర్శి ఆర్ రమేష్ పిలుపునిచ్చారు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోర్డ్స్ రద్దు చేయాలని, రైతంగా విధానాలకు నిరసనగా కార్మిక, రైతంగా, ప్రజాసంఘాలు ఇచ్చిన "జాతీయ సార్వత్రిక సమ్మె" పిలుపులో భాగంగా ట్రేడ్ యూనియన్ సెంటర్ అఫ్ ఇండియా (టియుసిఐ) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వాంచి, తెలంగాణ చౌరస్తా లో రాస్త రోఖో నిర్వహించి కేంద్రం కొత్తగా తెచ్చిన లేబర్ కోర్డ్స్ పత్రులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా లిలిట్రేడ్ యూనియన్ సెంటర్ అఫ్ ఇండియా(టియుసిఐ) రాష్ట్ర సహాయకార్యదర్శి ఆర్ రమేష్ మాట్లాడుతు దేశాన్ని నిలబెట్టేది కార్మికుడి చెమట, రైతు రక్తం, ప్రజల శ్రమ అని అది మరిచిన దేశ ప్రదాని ఎవరి తరఫున నిలుస్తోంది? అని, శ్రమజీవుల తరపునా? లేక కొద్దిమంది కార్పొరేట్ గుత్తాధిపతుల తరపునా? అని ఆయన ప్రశ్నించారు. గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను చూస్తే సమాధానం స్పష్టంగా కనిపిస్తోంధన్నారు. ఇది ప్రజా రాజ్యం కాదు,పెట్టుబడిదారుల రాజ్యమని ఇది సంక్షేమాన్నీ మరిచి, కార్పొరేట్ సంస్థలకు లాభాలను అందించే ప్రభుత్వం అన్నారు. కేంద్ర ప్రభుత్వం వందల ఏళ్ల కార్మిక పోరాటాల ఫలితంగా సాధించిన శ్రామిక చట్టాలను ఒక్క కలంతో రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల పొట్టకొట్టారు అన్నారు. "సంస్కరణలు" అనే పేరుతో తీసుకొచ్చిన ఈ కోడ్లు, వాస్తవానికి కార్మికుల హక్కులను కుదించే చట్టాలు. సమ్మె చేసే హక్కును పరిమితం చేయడం, సంఘాలు ఏర్పరచుకునే హక్కుపై అడ్డంకులు సృష్టించడం, పని గంటలను పెంచే అవకాశాలను యజమానులకు ఇవ్వడం, భద్రతా ప్రమాణాలను సడలించడం ఇవన్నీ చూస్తే పెట్టుబడిదారుల మెప్పు కోసమే పనిచేస్తున్నట్టుగా కనిపిస్తుందన్నారు. ఇది కార్మిక హక్కుల నిర్మూలన. కార్యక్రమంలో టియుసిఐ జిల్లా సహాయకార్యదర్శి ఎం అనిస్, నాయకులు కె రాజన్న, ఎస్ లింగం, సీపీఐ మాస్ లైన్ డివిజన్ నాయకులు ఆర్ దామోదర్, జి సాయరెడ్డి, మండల నాయకులు ఇ రమేష్, జె బాల్ రెడ్డి, కె ఆశిస్, బి సర్పంచ్, జి బాబురావు, ఎల్ గోపి, ఎస్ కె రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

## మరో రెండు అదనపు తరగతి గదులు మంజూరు చేయిస్తాం



**-అంగన్ వాడి భవనానికి భూమి...**

**-పూజ చేసిన ప్రజాప్రతినిధులు...**

**మన వార్త ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 12 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిషన్ దాస్ పేట, ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు శిథిల అవస్థలో ఉన్నందున రెండు అదనపు తరగతి గదులు మంజూరు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు,ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిషన్ దాస్ పేట, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అంగన్వాడి పాఠశాల భవన నిర్మాణానికి ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేరా బేగం, తో సర్పంచ్ ఎలగందుల నర్సింలు, కలిసి గురువారం భూమి పూజ చేశారు,ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేర బేగం, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య, మాట్లాడుతూ కిషన్ దాస్ పేట, ప్రభుత్వ పాఠశాలలో గదులు శిథిలవస్తులు ఉన్నందున రెండు అదనపు గదులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు, ఈజీఎస్ 12, లక్షల నిధులతో అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని వారు చెప్పారు, ఈ కార్యక్రమంలో ఏఎం సి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వార్డు సభ్యులు అంగూరి ప్రవీణ్, దొనుకుల చంద్రం, శ్యామ మంజుల, కొత్త చెన్నయ్య, బాలకృష్ణ గౌడ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు నేవూరి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ గౌస్ భాయ్, శనిగరం బాలరాజు,నంది కిషన్, మేగి నరసయ్య, మెండే శ్రీనివాస్ యాదవ్, గాజుల దాసు , మల్లేశం యాదవ్, గంట బుచ్చాగౌడ్, తదితరులు పాల్గొన్నారు,

## కోతుల ఏరివేతకు రైతు చర్చా మండలి తరపున 50 వేల విరాళం



**మన వార్త ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 12** :ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కోతులను ఎరివేయడానికి రైతు చర్చ మండలి తరపున 50 వేల రూపాయల నగదును రైతు చర్చ మండలి అధ్యక్షులు గుండం సుధాకర్ రెడ్డి,గురువారం ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నర్సింహులకు గ్రామపంచాయతీ కార్యాలయంలో అందజేశారు,మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో పాటు గ్రామస్తులపై కోతులు దాడులకు ఎగబడడంతో పలువురు దాడులకు గురి అవుతూ ఇబ్బందుల పాలవుతున్నారు,బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య ఇంటిలో కోతులు వారి తల్లి రామవ్వ పై దాడి చేశాయి దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది, ఆమెను వెంటనే స్థానికులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కోసం తరలించి వైద్యం అందించారు, అదేవిధంగా పలువురిపై కోతులు దాడులకు దిగుతుండడంతో సర్పంచ్ ఎలగందుల నరసింహులు ఇటీవల గ్రామపంచాయతీ ఆవరణలో అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కోతుల ఏరివేతకు ప్రతి ఇంటికి 250 రూపాయల చొప్పున ఇవ్వాలని తీర్మానించారు.. అందులో భాగంగా రైతు చర్చా మండలి తరపున అధ్యక్షులు గుండం సుధాకర్ రెడ్డి, 50 వేల నగదును సర్పంచ్ ఎలగందుల నరసింహులు కు గురువారం అందజేశారు. అక్కడ గ్రామపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ కటుకం రామచంద్రం ఉన్నారు

## గడ్కోల్ గ్రామం లో ఎమ్మెల్యే భూపతిరెడ్డి జన్మదిన వేడుకలు



**నిజామాబాద్ జిల్లా సిరికొండ( మన వార్త ) ఫిబ్రవరి 13** సిరికొండ మండలం గడ్కోల్ గ్రామం లొ గ్రామ ఉప సర్పంచ్ రొక్కం సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి గారిపుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంద్ర లతా శంకర్ వార్డ్ మెంబర్లు తలారి హేమంత్ కొమ్మటి గంగాధర్ మాజీ ఎంపీటీసీ లింబాద్రి వెల్మ భానుచందర్ రెడ్డి కామారెడ్డి సంతోష్ రెడ్డి భాస్కర్ చిన్న కొండయ్య కోచర్ గంగారెడ్డి జెసి బాలయ్య రమేష్ రెడ్డి గవాస్కర్ సుమన్ లిభ్య నాయక్ కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు

## పెద్దవాల్ గోట్ గ్రామంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి జన్మదిన వేడుకలు



**నిజామాబాద్ జిల్లా సిరికొండ( మన వార్త) ఫిబ్రవరి 13** సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డీ గారి జన్మదిన సందర్భంగా పెద్ద వాల్గోట్ లో సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్, ఉప సర్పంచ్ టి రాము కిసాన్ కేత, అధ్యక్షులు జీ నర్సారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు జై నర్సారెడ్డి, విలేజ్ శాఖ కార్యదర్శి ఎంపిటిసి భూమన్న, యూత్ అధ్యక్షులు సురేందర్ రెడ్డి,మైనార్టీ అధ్యక్షులు లియాకత్ అలీ, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మరియు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే జన్మదిన వేడుకలో పాల్గొన్నారు.

## వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొనుటకు పాదయాత్ర చేపట్టిన భక్తులు



**మన వార్తా ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మండలం ఫిబ్రవరి:12** వేములవాడకు మహిళా భక్తుల పాదయాత్ర.రాజన్న సిరిసిల్ల జిల్లా,ఎల్లారెడ్డిపేట మండలం, నారాయణపూర్ గ్రామం నుండి గురువారం మహిళా భక్తులు వేములవాడకు పాదయాత్ర చేపట్టారు మహాశివరాత్రి సందర్భంగా 20 మంది మహిళా భక్తులు నారాయణపూర్ లోని శివాలయం నుండి 30 కిలోమీటర్లు కాలినడకన నడిచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ని దర్శించుకోవాలని అత్యంత భక్తి శ్రద్దలతో ఈ పాదయాత్రను చేపట్టడం జరిగిందన్నారు గ్రామస్తులకు ఆ స్వామివారి ఆశీస్సులు అందే విధంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేస్తామని అన్నారు గ్రామ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య, ఉపసర్పంచ్ మోతే మధుసూదన్ రెడ్డి, ఈ యాత్రను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు

## కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడుదాం




**-టి యు సి ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆర్ రమేష్ పిలుపు...**

**నిజామాబాద్ జిల్లా సిరికొండ ( మన వార్త) ఫిబ్రవరి 12** కేంద్రం బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోర్టులను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2020 25 విత్తన సవరణ బిల్లు ఎల్ఐసి లో 100% విలేజ్ పెట్టుబడును అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలు ఉపసంహరించాలని కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానా లు వెనక్కి తీసుకోవాలని, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం రోజున, ధర్పల్లి మండల కేంద్రంలో గాంధీ చౌక్ లోటెడ్ యూనియన్ సెంటర్ అఫ్ ఇండియా (టి యు సి ఐ) ఆధ్వర్యంలో సమ్మె చేయడం జరిగింది .ఈ సందర్భంగా టి యు సి ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆర్ రమేష్ మాట్లాడుతూ మరణాలకు మరణ శాసనంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడుల రద్దుకై పోరాడాలని పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకునేంతవరకు పోరాడుతామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడుల అమలుతో 40 కోట్ల సంఘటిత అసంఘటిత కార్మికులు వారి కుటుంబాలు చితికిపోయేలా కార్పొరేట్ల లాభాలు ప్రోగేసుకోవడానికి మార్గం సుగమం చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక కార్పోరేట్ అనుకూల విధానాలను ఉపసహరించుకోవాలని కార్మిక వర్గం ప్రతిఘటనకు పూలుకోవాలని లేబర్ కోడ్స్ రత్తయ్య వరకు ఐక్యంగా పోరాడాలని కార్మికులకు పిలుపునిచ్చారు కార్యక్రమంలో టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం అనిస్, తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) మండల అధ్యక్షులు ఒ ఆశన్న, ప్రధానకార్యదర్శి ఒ.సాయన్న, ఏఐపికెఎంఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఇ రమేష్, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు ఆర్ దామోదర్, జిపి వర్కర్స్ నాయకులు జె విలాస్, టీ జగన్, బి భోజన్న, బి చందర్, జె సులోచన, డి శారదా, ఆర్ సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హస్తం గుర్తుకి ప్రజల నుండి విశేష స్పందన లభించింది



**-కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు తథ్యం...**

**-కాంగ్రెస్ మండల కార్యదర్శి సూర్యదేవర కోటేశ్వరరావు...**

**మధిర, ఫిబ్రవరి 12( మన వార్త ):**మధిర మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం ఖాయమని,22 వార్డుల్లోకాంగ్రెస్ గాలి వీచిందని, కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కువ స్థానానికి గెలవబోతున్నారని ఆ పార్టీ మండల కార్యదర్శి సూర్యదేవర కోటేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 4వ వార్డు ఇల్లందలపాడు కాంగ్రెస్, టిడిపి నేతలు, కార్యకర్తలకు,వార్డు ఇన్చార్జిలకు ఆయన ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు.డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిరలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వైపు ఓటర్లు ఎంతో చైతన్యవంతంగా ఆలోచన చేయటంతో హస్తం గుర్తుకి ప్రజల నుండి విశేష స్పందన లభించిందని తెలిపారు.రేపు జరగబోయే ఓట్ల లెక్కింపులో ప్రజల తీర్పు స్పష్టంగా వెల్లడవుతుందని,మధిర అభివృద్ధిలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించబోతోందని ఆయన స్పష్టం చేశారు.

## మోడీ ప్రభుత్వం తెచ్చిన బిల్లులు కార్మిక సంఘాల ఉనికి ప్రశ్నార్థకం

**-వివిధ రంగాల కార్మికులతో సమ్మె..**

**-తాసిల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన,..**

**-సిఐటియు జిల్లా నాయకులు మద్దాల ప్రభాకర్ రావు,రైతు సంఘం జిల్లా నాయకులు దివ్వెల వీరయ్య,..**




**మధిర,ఫిబ్రవరి12( మన వార్త):** మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలంలో కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు, రైతాంగాన్ని దెబ్బతీసే విత్తన బిల్లు,విద్యుత్ సవరణ బిల్లు,విబీజీ రాంజీ చట్టం లాంటి చట్టాలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని కార్మికుల ఉనికిని ప్రశ్నార్థంగా మార్చనున్నాయని సిఐటియు జిల్లా నాయకులు మద్దాల ప్రభాకర్ రావు విమర్శించారు.మండల కేంద్రమైన ఎర్రుపాలెం రింగ్ సెంటర్ నందు సిఐటియు ఆధ్వర్యంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా వివిధ సంఘాలకు సంబంధించిన కార్మికులు జాతీయ సార్వత్రిక సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు దివ్వెల వీరయ్య మాట్లాడుతూ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుండి అమల్లోకి రానున్న నాలుగు లేబర్ కోడ్ లు కార్పొరేట్లకు అనుకూలంగానూ కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు.అవి లేబర్ కోడ్ లు కావని కార్మికులను కార్పొరేట్ సంస్థలకు కట్టు బానిసలుగా మార్చేలా ఉన్నాయని విమర్శించారు.అనేక దశాబ్దాల పోరాటం ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో కార్మికుల హక్కులను అణిచివేయడానికి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని విమర్శించారు.ఈనాడు జరిగే సమ్మె కార్మికుల వేతనాలు పెంపు కోసం కాదని కార్మికుల గౌరవాన్ని పునరుద్ధించడానికి జరిగే పోరాటమని అన్నారు. కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి సామాజిక భద్రతా పథకాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాటాలతోనే తమ హక్కులను సాధించుకోగలుగుతారని సూచించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం వరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇస్తూ భారీ ప్రదర్శన నిర్వహించారు. తహసిల్దార్ సిబ్బందికి వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో ఆశ, అంగన్వాడి, గ్రామపంచాయతీ, మధ్యహాన భోజన కార్మికుల నాయకులు మల్లేశ్వరి, నంద్రు సుధారాణి, గంతాల నాగేశ్వరరావు, కొమ్మినేని మాధవి, రవీంద్ర, సీతామహాలక్ష్మి, ఆశమ్మ, నూర్జహాన్, ఆంగోతు వెంకటేశ్వర్లు, నాగులవంచ వెంకట్రామయ్య, దూదిగం బసవయ్య, దూదిగం శ్రీను, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి కాలంలో నీటి కొరత లేకుండా చూడాలని గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ ఏర్పాటు



**మన వార్తా ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మండలం ఫిబ్రవరి:12** వేసవికాలంలో నీటి కొరత లేకుండా ఉండాలని ఉద్దేశంతో రాచర్ల గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, పీర్ల మసీదు ప్రాంతంలోని గ్రామస్తుల కోసం గ్రామపంచాయతీ నిధులతో సింగిల్ ఫేజ్ పంప్లైన్ ఏర్పాటు చేసి, పంప్సెట్ను ప్రారంభించిన సర్పంచ్ కొండ రమేష్ గౌడ్,ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గాంతుల సతీష్ యాదవ్, గొర్రె మల్లేష్ యాదవ్, ఆకుల రామచంద్రం, పాశం హరీష్, కొండ పర్శ గౌడ్, బైరి అరుణజ్యోతి నాయకులు వెంకటేష్ రెడ్డి, సతీష్, అశోక్, దండు నర్సయ్య, ఆకులమురళి గౌడ్, పొన్నవేని రాజు యాదవ్, నాగరాజు, అలాగే పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణ మరియు గ్రామపంచాయతీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .

## ఉచిత ప్రధాన మంత్రి ఉజ్వల గ్యాస్ సిలిండర్స్ నీ పంపిణీ చేసిన

### బిజేపీ నాయకులు సీత శ్రీకాంత్ యాదవ్

**బెజ్జంకి,ఫిబ్రవరి 12(మనవార్త ప్రతినిధి)** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ళ గ్రామంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద కేంద్ర ప్రభుత్వం పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, సబ్సిడీ



సిలిండర్ల పంపిణీ చిట్టి సునీత,ఎండీ సమీనా చెప్యాల మహంతి,సీత రేణుక,చిట్టేల మానస,అర్హులైన మహిళలకి గుగ్గిళ్ల గ్రామ బిజెపి నాయకులు సీత శ్రీకాంత్ యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన మహిళలు పేదవారై ఉండాలి.ఇంట్లో ఇప్పటికే ఎల్పీజీ కనెక్షన్ ఉండని వారు ఈ యొక్క ఉజ్వల యోజన పథకానికి అర్హులని,ఈ యొక్క ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందాలంటే అవసరమైన పత్రాలు: ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం, ఖేజ ఫారమ్.ఆన్లైన్: https://www.pmuy.gov.in/ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.అనంతరం మహిళలు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్ లభించడం పట్ల సంతోషంగా ఉన్నామని తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి



**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 12 ( మన వార్త ప్రతినిధి )** దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని మెదక్ చేగుంట రహదారిపై రాస్తారోకో ధర్నా, చేపట్టారు, ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోర్టులు వెంటనే వెనక్కి తీసుకోవాలని రైతంగానే దెబ్బతీసే విత్తన బిల్లు విద్యుత్ సవరణ బిల్లు రాంజీ చట్టం లాంటి చట్టాలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని కార్మికుల జీవితాలను ప్రశాంతంగా మార్చనున్నాయని వారు తెలిపారు, నాలుగు లేబర్ కోర్టులో కార్పొరేట్లకు అనుకూలంగాను కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని వారు విమర్శించారు, పోరాటం ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దుచేసి వాడి స్థానంలో కార్మికుల హక్కులను అణిచివేయడానికి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని వారు అన్నారు కార్మికులకు ఈపీఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ వంటి సామాజిక భద్రత పథకాలను ఏర్పాటు చేయాలని ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని వారి, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా వివిధ సంఘాలకు సంబంధించిన కార్మికులు ఆందోళనలకు దిగారు, ఈ కార్యక్రమంలో సిఐటియు సహాయ కార్యదర్శి గౌరయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు నరేందర్ రెడ్డి ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు దేవమ్మ, నాగమణి, సంతోష, కల్పన, విజయలక్ష్మి, వనిత, ఏసుమని, రాజమణి తదితరులు పాల్గొన్నారు

## ఐక్య కార్యచరణ తో సంఘర్షణ చేస్తేనే ఆశయం సిద్ధిస్తుంది



**– గగన మాలిక్ బౌద్ధ ప్రచారకులు....**

**జహీరాబాద్, ఫిబ్రవరి 12 (మన వార్త):** ఐక్య కార్య చరణతో సంఘర్షణ చేస్తేనే ఆశయం సిద్ధిస్తుందని బౌద్ధ ప్రచారకులు గగన్ మాలిక్ ఫౌండేషన్ చైర్మన్ గగన్ మాలిక్ సూచించారు. కలబుర్గి నుండి నాగార్జున సాగర్ వరకు థాయిలాండ్ బౌద్ధ భిక్షువులతో కొనసాగుతున్న ధమ్మయాత్ర గురువారం కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామానికి చేరుకుంది. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, గ్రామ సర్పంచ్, ఆయా రాజకీయ నాయకులు, మహిళలు, పాఠశాల విద్యార్థులు కలిసి ధమ్మయాత్ర భిక్షువుల దారిలో పువ్వులను పరుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డిక్కీ జిల్లా అధ్యక్షులు జనార్ధన్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. సభలో గగన్ మాలిక్ మాట్లాడుతూ మానవ ఆరోగ్యకరమైన జీవన మార్గాన్ని బౌద్ధం ధర్మం బోధిస్తుందని, శాంతి, కరుణ, ప్రేమ బౌద్ధం యొక్క దిశా నిర్దేశం అన్నారు. ప్రపంచ శాంతిని కోరుకుంటూ భగవాన్ గౌతమ బుద్ధుని అస్థికలను ప్రత్యేక విమానంలో థాయిలాండ్ నుండి భారత దేశానికి తీసుకు వచ్చి ఇక్కడ 400 కిలోమీటర్లు ధమ్మ పాదయాత్ర చేస్తున్న బౌద్ధ గురువు (మాంక్) లకు మనం రుణపడి ఉన్నామని అన్నారు. బౌద్ధ భిక్షువులు మన నుండి ఏమి కోరుకోవడం లేదని, మనుషులంతా మానవతా భావనతో ప్రేమగా, గౌరవంగా, శాంతిగా జీవించడమే వారి ఆశయం అన్నారు. బాధ్యతలను విస్మరించి, మహనీయుల అభిమానులం అని చెప్పుకోవడం గొప్ప కాదన్నారు. మానవత్వ విలువలతో, బుద్ధిగా జీవించే వారిని మతంతో ముడి పెట్ట కూడదన్నారు. కార్యక్రమంలో ధమ్మ యాత్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ మాంక్ ఫ్రా సంగ్సక్ కోవిడో, ఇతర బంతోజీలు, మాంక్ అజంతోన్, గ్రామ సర్పంచ్, నాయకులు రాం లింగారెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జర్నలిస్ట్ తలారి అశోక్, సమతా సైనిక్ నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కేశవపట్నంలో కార్మికుల సార్వత్రిక సమ్మె

**– కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్**

**శంకరపట్నం:ఫిబ్రవరి12(మనవార్త ప్రతినిధి)** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శంకరపట్నం మండలం కేశవపట్నంలో గురువారం అంగన్వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు,గ్రామపంచాయతీ




సిబ్బంది,కార్మికులు,సీఐటియు,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుండి బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.మానవహారంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వం విధించిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ మాట్లాడారు.అంగన్వాడీ టీచర్లకు,ఆశా వర్కర్లకు 26వేల గౌరవ వేతనం అందించాలన్నారు.గ్రామ పంచాయతీ కార్మికులు,హమాలీల సమస్య పరిష్కరించాలని అన్నారు.భవననిర్మాణ కార్మికులను,హమాలీ కార్మికులను ఆదుకోవాలని,వృత్తిలో మృతులైన కార్మికుల కుటుంబాలకు 10 లక్షల ఆర్థిక సహాయం,గాయపడిన వారికి ఫించన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదే విధంగా ఆటో డ్రైవర్లను ఆదుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య,బీసీ సంఘం నాయకులు బొంగోని అభిలాష్,అంగన్వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు,గ్రామపంచాయతీ కార్మికులు,భవననిర్మాణ కార్మికులు,ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## H.S. కిచెన్స్ వెజ్ , నాన్ వెజ్ రెస్టారెంట్ ప్రారంభం

**భద్రాద్రి జిల్లా కొత్తగూడెం (మన వార్తా ప్రతినిధి) ఫిబ్రవరి 13:**విద్యానగర్లో నూతనంగా ప్రారంభమైన ఎ.ా. కిచెన్స్ వెజ్ ఢ నాన్ వెజ్ రెస్టారెంట్ ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మన శాసనసభ సభ్యులు కోణంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో విద్యానగర్ గ్రామ సర్పంచ్ భుఖ్య శాంతి శ్రీ , ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి , వార్డ్ మెంబర్ జకరయ్య తదితరులు పాల్గొన్నారు. రెస్టారెంట్ యజమానిని కలిసి మెనూ వివరాలు తెలుసుకుని, ప్రజలకు రుచికరమైన మరియు నాణ్యమైన వంటకాలు అందించాలని సూచించారు.ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులు మరియు ప్రజలకు రెస్టారెంట్ యజమానులు తరుణ్, తనిష్ కృతజ్ఞతలు తెలియజేశారు.విద్యానగర్ ప్రాంత ప్రజలకు ఈ రెస్టారెంట్ ద్వారా రుచికరమైన భోజన వసతులు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని స్థానికులు తెలిపారు.

## అనంతారం లో నూతన సర్పంచ్,వార్డు సభ్యులకు గౌడ సంఘం ఘన సన్మానం..



**ఇల్లంతకుంట,ఫిబ్రవరి 12 (మన వార్త ప్రతినిధి);**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచ్ మరియు వార్డు సభ్యులను గౌడ సంఘం అధ్యక్షుడు వొల్లాల అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో గౌడ సంఘ సభ్యులు గురువారం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు.గ్రామ ప్రజల విశ్వాసంతో బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం గౌడ్,వార్డు సభ్యులు వొల్లాల లక్ష్మీ కృష్ణ కుమార్ గౌడ్,గోనపల్లి లావణ్య వెంకటేశం గౌడ్ లను శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన సంఘ సభ్యులు గ్రామ ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి దారి తీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం సర్పంచ్ రజిత వెంకటేశం మాట్లాడుతూ గ్రామంలో అన్ని కులాలు,వర్గాల ప్రజలను సమానంగా పరిగణిస్తూ ప్రతి వార్డును సమాన అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానని,మాటల కంటే పనితోనే సమాధానం ఇస్తానని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా తనను సన్మానించిన గౌడ సంఘ సభ్యులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు,గ్రామ పెద్దలు,యువకులు పాల్గొన్నారు.

## పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తికి రూ.20వేల జరిమానా




**శంకరపట్నం:ఫిబ్రవరి12(మనవార్త ప్రతినిధి)** శంకరపట్నం మండలం కేశవపట్నం సమ్మక్క జాతర సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన పప్పు మల్లేష్ కు శంకరపట్నం తహసిల్దార్ సురేఖ రూ.20వేల జరిమానా విధించినట్లు కేశవపట్నం ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు.శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన పప్పు మల్లేష్ వివిధ నేరాల్లో పాల్గొనడంతో అతనిపై కేశవపట్నం పోలీస్ స్టేషన్లో హిస్టరీ కేసు నమోదైంది.గతంలో తహసిల్దార్ ముందు బైండోవర్ చేసిన బాండు ఉంది.పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన నేరానికి గురువారం తహసిల్దార్ ముందు ప్రవేశపెట్టగా బాండ్ షరతులను ఉల్లంఘించినందుకు తహసిల్దార్ సురేఖ రూ.20 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడి కేసు నమోదు చేసి,బైండోవర్ చేయబడిన తర్వాత మళ్లీ నేరానికి పాల్పడినట్లయితే ఒక లక్ష రూపాయలు జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధించనున్నట్లు తెలిపారు.ఎవరైనా చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా,శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శేఖర్ రెడ్డి హెచ్చరించారు.కావున మండల ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

## యూరియా కోసం రోడెక్కిన రైతులు




**శంకరపట్నం:ఫిబ్రవరి12(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో గురువారం కరీంనగర్ వరంగల్–జాతీయ రహదారిపై రైతులు ఆందోళన చేపట్టారు.మొబైల్ యాప్ తో ఇబ్బందులు పడుతున్నామని ఆంక్షలు లేకుండా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా పంపిణీలో అనుసరిస్తున్న విధానాలతో రైతులకు శాపంగా మారిందని ఆరోపించారు.వెంటనే రైతులకు మొబైల్ యాప్ లేకుండా గతంలో పంపిణీ చేసిన విధంగా సహకార సంఘాల ద్వారా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

## అల్వాల్లో వరుస విషాదాలు మానసిక ఆందోళనలతో ఇద్దరి మృతి


**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిబ్రవరి 12 మన వార్త:**అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యల కారణంగా రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందిన విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలు స్థానికంగా తీవ్ర కలకలం రేపాయి. హార్పిక్ సేవించి వ్యక్తి మృతి పోలీసుల వివరాల ప్రకారం... మిట్ట కోల మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతని కుమారుడు మిట్ట కోల మధు (38) గతంలో బ్రెయిన్ స్ట్రోక్కు గురై శస్త్రచికిత్స చేయించుకున్నాడు. సుమారు 14 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్న మధు, ఆపరేషన్ అనంతరం మానసికంగా కలత చెంది శారీరకంగా బలహీనపడ్డాడు. మాట సరిగా రాకపోవడం, కుడిచేయి పని చేయకపోవడం వంటి సమస్యలతో తీవ్ర నిరాశలో ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.ఫిబ్రవరి 10వ తేదీ మధ్యాహ్నం భోజనం అనంతరం అతనికి ఆహారం ఇవ్వడానికి వెళ్లిన తండ్రి, మధు హార్పిక్ టాయిలెట్ క్లీనర్ సేవించినట్లు గమనించారు. వెంటనే సమీపంలోని వెల్నెస్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం 7 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనపై ఏఎస్ఐ కె. తుల్జారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఆస్తి వివాదంతో మహిళ ఆత్మహత్య ఇక మచ్చ బొల్లారం ప్రాంతంలో ఆస్తి వివాదం కారణంగా ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... సత్యనారాయణ (47), వృత్తి కూలి, సంజీవరెడ్డి గార్డెన్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఆరెగూడెం గ్రామంలో ఉన్న ఇంటి స్థలం విషయంలో వివాదం నెలకొనడంతో ఆయన భార్య నాగమణి (45) గత ఆరు నెలలుగా తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యారు.ఇంటి సమస్యలతో కలత చెంది మేడ్చల్ సీఎంఆర్ ఆస్పత్రిలో మానసిక చికిత్స పొందుతున్నప్పటికీ ఆమె ఆరోగ్యం మెరుగుపడలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. తరచూ అసాధారణంగా ప్రవర్తిస్తూ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడం జరిగేదని పేర్కొన్నారు. ఘటనకు ముందు తన కుమారుడికి ఫోన్ చేసి "నేను చనిపోతున్నాను" అని చెప్పినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకోగా నాగమణి సీలింగ్ ఫ్యాన్కు ఉరివేసుకున్న స్థితిలో కనిపించిందని తెలిపారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం వరుసగా చోటుచేసుకున్న ఈ ఘటనలు మానసిక ఆరోగ్య సమస్యల తీవ్రతను మరోసారి వెలుగులోకి తెచ్చాయి. కుటుంబ సభ్యులు, సమాజం సమయానికి స్పందించి మానసిక ఆందోళనలో ఉన్నవారికి సరైన మద్దతు అందించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## ట్రెండీ మెన్స్ బట్టల షాప్ ప్రారంభం విద్యానగర్ కాలనీ




**భద్రాద్రి జిల్లా కొత్తగూడెం (మన వార్త ప్రతినిధి) ఫిబ్రవరి 13:**విద్యానగర్ కాలనీలో నూతనంగా ప్రారంభమైన ట్రెండీ మెన్స్ బట్టల షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మన శాసనసభ్యులు కోణంనేని సాంబశివరావు , కోనేరు చిన్న హాజరై షాప్ను ప్రారంభించారు.కార్యక్రమంలో విద్యానగర్ గ్రామ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ , ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి , వార్డ్ మెంబర్ జకరయ్య తదితర ప్రజాప్రతినిధులు మరియు స్థానికులు పాల్గొన్నారు.షాప్లో పురుషుల కోసం వివిధ రకాల ట్రెండీ టీ–షర్టు, జీన్స్ ప్యాంట్లు, ఫార్మల్ మరియు క్యాజువల్ డ్రెస్సులు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. అన్ని వర్గాల వారికి అందుబాటు ధరల్లో నాణ్యమైన దుస్తులు లభిస్తాయని వారు పేర్కొన్నారు. కొత్త షాప్ ప్రారంభం స్థానిక యువతకు, పురుషులకు ఫ్యాషన్ పరంగా మరింత సౌకర్యాన్ని కల్పించనుంది.

## అల్వాల్లో అక్రమాలపై దాడి పార్క్ భూమి రక్షణలో హైడ్రా కఠిన చర్యలు



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిబ్రవరి 12 మన వార్త:** అల్వాల్ సర్కిల్ పరిధిలోని స్నేహ కాలనీ పార్క్ స్థలంపై అక్రమంగా జరిగిన కబ్జాపై హైడ్రా అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ప్రజలకు విశ్రాంతి, వినోదం కోసం కేటాయించిన పార్క్ స్థలాన్ని సుమారు 800 గజాల మేర అక్రమంగా ఆక్రమించడంతో పాటు దాదాపు 5 కోట్ల విలువైన భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరిగినట్లు అధికారులు గుర్తించారు.టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి కూడా మాట్లాడుతూ, అనుమతులు లేకుండా చేపట్టే నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనల ప్రకారం మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని ప్రజలకు సూచించారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అల్వాల్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, పార్కులపై అక్రమాలను అరికట్టేందుకు హైడ్రా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో జరిగిన ఆక్రమణలపై కూడా కూల్చివేతలు చేపట్టిన విషయం తెలిసిందే.ప్రజా స్థలాల పరిరక్షణలో అధికారులు కఠిన వైఖరి అవలంబించడం పట్ల స్థానికులు స్వాగతం పలుకుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి కబ్జాలు పునరావృతం కాకుండా నిరంతర పర్యవేక్షణ అవసరమని వారు కోరుతున్నారు.

## రాజన్నపేటలో అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు



**-అమ్మకాలను నిలిపివేయాలని సిఐకి వినతి పత్రం...**

**మన వార్త ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 12 :**ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని వెంటనే అమ్మకాలను నిలిపివేయాలని ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్, కు రాజన్నపేట గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ధ్యాప దేవయ్య, గురువారం అందజేశారు, ఎక్సైజ్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవటం లేదని ఇప్పటికైనా రెండవ వార్డులో రెండు మద్యం దుకాణాలు అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అమ్ముతున్నారని దీనివల్ల ప్రజలకు అన్యాయం జరుగుతుందని దీనివల్ల గ్రామంలో యువకులు విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడే అవకాశంతో పాటు తప్పుదారి పట్టె అవకాశాలు కూడా ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు, సంబంధిత ఎక్సైజ్ అధికారులు తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ పద్ధతి ప్రకారం గ్రామాలలో మద్యం దుకాణాలను ఉండకుండా చూడాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, కు అందజేశారు

## బండలింగంపల్లి గ్రామములో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం కొరకు భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ బాలరాజు నర్సగౌడ్



**మన వార్త ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మండలం ఫిబ్రవరి:12** ఎస్సీ కమిటీ హాల్ కు భూమి పూజ చేసిన బండలింగంపల్లి గ్రామ సర్పంచ్ బాలరాజు నర్స గౌడ్, దామోదర రావు,రాజ్యసభ నిధుల నుండి 5 లక్షలు మంజూరు ఇప్పించన బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల శాసన సభ్యులు కె టీ రామారావు, కి కమ్యూనిటీ సభ్యుల తరుపున కృతజ్ఞతలు తెలుపుతూ భూమి పూజ చేసిన అనంతరం ఉప సర్పంచ్ బొడ్డు రాజు, వార్డు మెంబర్స్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, కుల సంఘం పెద్దమనుషులు గ్రామ నాయకులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు

## బహుజన సేన నాయకులు జింక శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా లైబ్రరీకి రాజ్యాంగ పుస్తకాల అందజేత



**వేములవాడ ఫిబ్రవరి 12 (మన వార్త)**బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ అధ్యక్షులు జింక శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ లైబ్రరీకి రాజ్యాంగ పుస్తకాలను బహుజన రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బహుజన సేన రాజన్న సిరిసిల్ల ప్రధాన కార్యదర్శి లక్కె సాగర్ మాట్లాడుతూ, దేశ ప్రజలందరూ భారత రాజ్యాంగంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాజ్యాంగం దేశ ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛలు కల్పించే మహత్తర గ్రంథమని, దాని ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకుని కాపాడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. జింక శ్రీధర్ పుట్టినరోజును పురస్కరించుకుని సామాజిక బాధ్యతగా లైబ్రరీకి రాజ్యాంగ పుస్తకాలను అందజేయడం సంతోషకరమని తెలిపారు. యువత రాజ్యాంగ స్ఫూర్తిని తెలుసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుండా శ్యామ్, నేదురి శ్రీకాంత్,లక్కె దినాకర్, గుడిసె శశి, శ్రీను ఒక తదితరులు పాల్గొన్నారు


## అల్వాల్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సూర్యనగర్ కాలనీ పర్యటన

**-ప్రజా సమస్యలపై ప్రత్యక్షంగా స్పందించిన డిసి.బోగేశ్వర్లు....**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిబ్రవరి 12 మన వార్త :**అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సూర్యనగర్ కాలనీని సందర్శించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను సమీక్షించారు. కాలనీ ప్రతినిధులు మరియు నివాసితులు తమ సమస్యలను ప్రత్యక్షంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.కాలనీ సభ్యులు వివరించిన సమస్యలు ఇలా ఉన్నాయి గత మూడుసంవత్సరాలుగా భగీరథ నీటి కనెక్షన్ ఉన్నప్పటికీ సరైన నీటి సరఫరా లేకపోవడం, అనేక వీధుల్లో స్ట్రీట్ లైట్లుపనిచేయకపోవడం,డ్రైనేజ్ పైప్‌లైన్ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడటం. అలాగే కాలనీలో పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు దెబ్బతినడంతో ప్యాచ్ వర్క్ చేయాలని కోరారు.కొన్ని మ్యాన్ హోల్స్ దెబ్బతిని ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందని,వాటిని మరమ్మతు చేసి సక్రమంగా అమర్చాలని నివాసితులు అభ్యర్థించారు. మోత్కులకుంట చెరువులో ఉన్న గుర్రపు డెక్క చెట్ల కారణంగా దోమల సమస్య పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులో శుభ్రపరిచే పనులు ఇటీవల ప్రారంభమైనప్పటికీ పూర్తిస్థాయిలో కొనసాగించాలని సూచించారు. అలాగే ఇటీవలి కాలంలో ఫాగింగ్ చేయకపోవడంతో దోమల వ్యాప్తి పెరిగిందని, వెంటనే ఫాగింగ్ నిర్వహించాలని కోరారు.డిప్యూటీ కమిషనర్ అన్ని సమస్యలను ఓర్పుతో విన్నారు. సంబంధిత విభాగాల అధికారులతో సమన్వయం చేసి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.స్థానికులు అధికారుల స్పందనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సమస్యల పరిష్కారంపై ఆశాభావం వ్యక్తం చేశారు.




# వామ్మో ఇసుక ట్రాక్టర్



**ఇల్లంతకుంట,ఫిబ్రవరి 12 ( మన వార్త ప్రతినిధి );** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్లు భారీ వేగంతో దూసుకెళ్తుండటంపై ప్రజల్లో తీవ్ర భయాందోళన నెలకొంది.ట్రాక్టర్ శబ్దం వినిపించగానే "వామ్మో...ఇసుక ట్రాక్టర్ వస్తోంది.."అంటూ ప్రజలు పక్కకు తప్పుకునే పరిస్థితి ఏర్పడింది.గురువారం వల్లంపట్ల గ్రామంలో జరిగిన ఘటన ఈ ఆందోళనకు మరింత కారణమైంది.గ్రామంలో అతివేగంతో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ ఒక కోతిని ఢీకొనడంతో అది అక్కడికక్కడే మృతి చెందింది.ఈ ఘటనతో గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు."అదే సమయంలో అక్కడ మనుషులు ఎవరైనా ఉన్నా ఇదే పరిస్థితి వచ్చేది కదా...అతి వేగంతో ఈ రోజు మూగ జీవి ప్రాణం తీశారు అంటే,ఇదే నిర్లక్ష్యంతో మనుషుల ప్రాణాలు కూడా పోతాయి"అంటూ వల్లంపట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉదయం స్కూల్‌కు వెళ్లే చిన్నారులు,రహదారుల వెంట నడిచే వృద్ధులు,వాహనాలపై ప్రయాణించే ప్రజలు ట్రాక్టర్ల వేగానికి వణికిపోతున్నారు.గ్రామాల లోపలే నియంత్రణ లేకుండా దూసుకెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు ఎప్పుడెప్పుడు ప్రమాదం జరుగుతుందో అన్న భయాన్ని కలిగిస్తున్నాయి.ఇసుక ట్రాక్టర్లకు వేగ పరిమితులు ఖచ్చితంగా అమలు చేయాలని,గ్రామాల్లో కఠిన నియంత్రణలు విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ప్రమాదం సంభవించిన తర్వాత కాకుండా ముందుగానే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

## వ్యవసాయ యాంత్రీకరణ పథకం లో 50 రాయితీ పై వ్యవసాయ పనిముట్లు




**మన వార్త ప్రతినిధి ఎల్లారెడ్డి పేట పిబ్రవరి :12** వ్యవసాయ యాంత్రీకరణ పథకం లో భాగంగా 50% రాయితీ పై వ్యవసాయ పనిముట్లను రైతులకు ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేర గురువారం రైతులకు అందజేశారు, వ్యవసాయశాఖ ద్వారా వచ్చిన రోటావేటర్స్-2 కేజీవీల్స్ -1,కల్టివేటర్స్-1, తైవాన్ స్ప్రేయర్స్ -2,ను గురువారం బొప్పాపూర్ గ్రామ రైతువేదిక వద్ద పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి ,వైస్ చైర్మన్ గుండాడీ రాంరెడ్డి మండల వ్యవసాయ అధికారీ రాజశేఖర్ .వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీశైలం వెంకటేష్ ముకుందకుమార్ లబ్ధి దారులు, మండల,గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొనడం జరిగింది.

## నేడు నిర్వహించే మున్సిపల్ ఎన్నికల లెక్కింపు అన్ని ఏర్పాట్లు పూర్తి...



**రామాయంపేట ఫిబ్రవరి 12 ( మన వార్త ప్రతినిధి)** మున్సిపల్ ఎన్నికల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు అన్నారు రామాయంపేట మున్సిపల్ ఎన్నికల స్ట్రాంగ్ రూమును కౌంటింగ్ కేంద్రాలను తహశీల్దార్ తో కలిసి ఆయన పరిశీలించారు కౌంటింగ్ సిబ్బందికి పలు సూచనలు సలహాలు తెలియచేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమాలను పాటించి మున్సిపల్ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ జరగాలని ఆయన సిబ్బందికి సూచించారు, ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశామని, నేడు ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శాంతిని భద్రతలకు భంగం కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రజనీకుమారి, ఎంపీడీవో శజాలుద్దీన్, డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ రాధా కిషన్, ఎన్నికల అధికారి డి ఎల్ పి ఓ సాయిబాబా, మున్సిపల్ ఇన్చార్జి కమిషనర్ రఘువరన్, మున్సిపల్ కంప్యూటర్ ఆపరేటర్ కాలేరు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు,

## కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలి...



**ఇల్లంతకుంట,ఫిబ్రవరి 12 (మన వార్త ప్రతినిధి);**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామంలో రంగనాయక సాగర్ 11/6 కాలువ అసంపూర్తి పనులను పూర్తి చేయాలని రైతులు చేపట్టిన మూడవరోజు రిలే నిరాహార దీక్షకు గురువారం మద్దతు తెలిపిన భారతీయ జనతా పార్టీ ఇల్లంతకుంట మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వము,ప్రస్తుత ప్రభుత్వము 11/6 కాలువ పనులను పూర్తి చేయడంలో విఫలమయ్యాయని ఈ సందర్భంగా తెలియజేశారు.ఇల్లంతకుంట తంగళ్ళపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు గత సంవత్సరం 19 రోజులు దీక్ష చేశారని గుర్తు చేశారు.దీక్ష విరమింప చేయడానికి ఇల్లంతకుంట మండల తహసిల్దార్ ఎండి ఫారుక్ అసంపూర్తి పనులకు సంబంధించిన ప్రొసీడింగ్ మరియు నిధులు విడుదల అయ్యాయని,వారంలో పనులు ప్రారంభమవుతాయని నమ్మకం ఇచ్చారు అంటూ.అది నమ్మిన రైతులు దీక్ష విరమణ చేశారని,సంవత్సరం గడుస్తున్న ఎటువంటి కదిలికలేదని ఈ సందర్భంగా తెలియజేశారు.అసంపూర్తి పనులు పూర్తయితే 10 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.కాలువ నీరు వస్తుందని నమ్మకంతో ప్రస్తుతం కూడా అనేకమంది రైతులు పంట సాగు చేశారని కొద్ది రోజుల్లో నీటి ఎద్దడి ప్రారంభం కాబోతుందని నివారణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు.పంటలు ఎండిపోకుండా తాత్కాలిక పంపింగ్ సిస్టంను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఒక 100 మీటర్లు తాత్కాలిక పంపింగ్ సిస్టం ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేస్తే పంటలు ఎండిపోకుండా కాపాడిన వారవుతారని ఈ సందర్భంగా తెలియజేశారు.అదేవిధంగా కాలువ పనులు ఆగిపోవడం వలన నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని,కాలువ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు కరికె నవీన్,గాదె మధుసూదన్,పయ్యావుల బాలయ్య,పలుమారు రవి,కంటము రవి,రాజిరెడ్డి,ఎల్లం,శ్రీనివాస్,మల్లేశం నాయకులు దుద్దెడ రాజు,భారతీయ జనతా పార్టీ భూత్ అధ్యక్షులు కుడుముల శ్రీహరి,మారవేణి రాజు,తుమ్మలపల్లి కమలాకర్ రావు,దాసరి యాదగిరి,బర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించిన అధికారులు...




**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 12 ( మన వార్త ప్రతినిధి)** చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన 2024- 2025 కు సంబంధించి ఏడుకోట్ల 56 లక్షల 74,137 రూపాయలకు సంబంధించిన రికార్డుల తనిఖీలు నిర్వహించారు,వాటిలో మొత్తం 345 పనులకు సంబంధించి కూలీలకు చెల్లించిన ఆరు కోట్ల 36 లక్షల 44,793 రూపాయలు కూలీలకు చెల్లించినట్టు ఒక కోటి 20,29,344 మెటీరియల్ కొనుగోలు చేసినట్టు లెక్కలు చూపించారు, వీటికి సంబంధించి 28 వేల ఎనిమిది వందల అరవై రూపాయలు రికవరికి ఆదేశాలు జారీ చేసినట్లు, 5వేల రూపాయలు పెనాల్టీ విధించినట్లు అధికారులు ఆదేశాలు జారీ చేశారు, అదేవిధంగా ఎస్ కొండాపూర్ ఎఫ్ఏకు శోకజ్ నోటీసులు జారీ చేశారు, కొండాపూర్ ఎఫ్ఏ అవకతవకలకు పాల్పడ్డాడని ఆరోగ్యం బాగాలేక మంచానికే పరిమితమైన వ్యక్తిపై పనిచేసినట్టు రికార్డు చేసి డబ్బులు తీసుకోవడం జరిగిందని సుమారు ఏడుగురు కూలీల పైన లక్ష రూపాయల పైన డబ్బులు తీసుకున్నట్లు తనిఖీలో తేలింది, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫీల్డ్ అసిస్టెంట్ కు అధికారులు నోటీసులు అందజేశారు, ఆయనపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పిడి రంగాచార్యులు, డీవీవో శ్రీహరి, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీవో దామోదర్, ఎస్టియం అంజాగౌడ్, ఎస్ఆర్పి నాగరాజు, ఏపీవో రాజ్ కుమార్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# బాలికలకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ..



**-గర్ల్ చైల్డ్ ఎంవవర్మెంట్ కార్యక్రమంలో ధైర్యం,ఆత్మవిశ్వాసం పెంపు...**

**ఇల్లంతకుంట,ఫిబ్రవరి 12 (మన వార్త ప్రతినిధి):**ఇల్లంతకుంట మండలం గాలిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న బాలికలకు గురువారం మార్షల్ ఆర్ట్స్ శిక్షణ ప్రారంభమైంది.ఇది గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ ప్రోగ్రాం భాగంగా నిర్వహించబడింది.అని ప్రధానో పాధ్యాయురాలు మేకల పావని మాట్లాడుతూ,ఈ శిక్షణ బాలికలకు భవిష్యత్తులో ధైర్యంగా,ఆత్మవిశ్వాసంతో తిరగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని,బాలికలు దీన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఎల్.దేవరాజ్ మరియు ఉ పాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## బాకూరు పల్లె తండా జాల బండ ప్రాంతంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ

పథకం 100 రోజుల పనులు గ్రామ సర్పంచ్ అజ్మీర రాజు నాయక్ ప్రారంభించడం జరిగినది



**మన వార్తా ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మండలం ఫిబ్రవరి :12** ఎల్లారెడ్డిపేట మండలం, బాకూరు పల్లె తండ గ్రామంలో, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామస్తుల జీవనోపాధి మెరుగుపడేందుకు ఈ విధమైన పనులు భవిష్యత్తులో కూడా కొనసాగించబడతాయి అని ఇట్టి ఉపాధి పనిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అజ్మీర రాజు నాయక్, ఇలా అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోహన్ నాయక్ ఫీల్డ్ అసిస్టెంట్ కొప్పుల నరసింహులు, రాములు నాయక్, హీర నాయక్, లచ్చి రామ్ నాయక్, అనిల్, శంకర్, వార్డు మెంబర్లు మరియు ఇతర ప్రజా ప్రతినిధులు కూలీలు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు

## పాదచారిని ఢీ కొట్టిన లారీ తీవ్ర గాయాలు 108 అంబులెన్స్ లో ఆస్పత్రికి తరలింపు...



**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 12 ( మన వార్త ప్రతినిధి )** చిన్న శంకరంపేట మండలం గవలపల్లి చౌరస్తాలో గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది, ఈ ప్రమాదంలో కొరవి పల్లి తండాకు చెందిన పూల్ సింగ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి, లారీ ఢీకొనడంతో అతను వాహనం కింద ఇరుక్కుపోయి కాలు చేయి విరిగిపోయాయి స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా 108 అంబులెన్స్ లో బాధితులని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## బాలికలు సృజనాత్మకత, సమయస్ఫూర్తితో ఆలోచించి జీవితంలో రాణించాలి



**–జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్...**

**కల్వకుర్తి ఫిబ్రవరి 12 మన వార్తా ప్రతినిధి** నేటి పోటీ ప్రపంచంలో బాలికలు కేవలం పుస్తక జ్ఞానంతో మాత్రమే కాకుండా సృజనాత్మకత, సమయస్ఫూర్తి, వివేకంతో కూడిన ఆలోచనలను అలవర్చుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఏ. రమేష్ కుమార్ పేర్కొన్నారు.గురువారం నాగర్ కర్నూల్ మండలంలోని నాగనూల్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థినుల కోసం నిర్వహించిన ఫేర్వెల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాబోయే పదో తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితానికి తొలి మెట్టు వంటివని తెలిపారు.పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, మంచి మార్కులు సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థినులను కోరారు. ప్రతి బాలిక తనలోని ప్రతిభను గుర్తించి, సృజనాత్మకతను పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, పట్టుదల, సానుకూల దృక్పథం అలవర్చుకుంటే లక్ష్య సాధన సులభమవుతుందని సూచించారు. కష్టకాలాల్లో నిరుత్సాహపడకుండా వాటిని అవకాశాలుగా మలుచుకుని ముందడుగు వేయగలిగిన వారే జీవితంలో రాణిస్తారని పేర్కొన్నారు.మహిళా విద్య సమాజాభివృద్ధికి కీలకమని పేర్కొంటూ, చదువుతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మండల విద్యాధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా టెస్ట్ బుక్ మేనేజర్ నరసింహులు, కేజీబీవీ ప్రత్యేక అధికారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎండాకాల త్రాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళిక



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 12 మనవార్త ప్రతినిధి** రాబోయే ఎండాకాలంలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఎల్కతుర్తి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్. విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా ఎన్.విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో త్రాగునీటి వనరుల పరిస్థితిని సమీక్షించి బోర్‌వెల్లు ఓవర్ హెడ్ ట్యాంకులు పైప్‌లైన్‌ల మరమ్మతులు తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. అధికారులు గ్రామాల వారీగా నివేదికలు సమర్పించి సమస్యలు మరియు అవసరాలపై చర్చించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు అలాగే ఆర్డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్ గ్రిడ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ మండల పంచాయతీ అధికారి సి. హెచ్. రవి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అనురాగ్ తదితర అధికారులు హాజరయ్యారు.

## మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు

**–వాణిజ్య పరిమాణ మాదకద్రవ్య కేసులో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష...**

**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 12 మన వార్త ప్రతినిధి** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన వాణిజ్య పరిమాణ మాదకద్రవ్య కేసులో నిందితులకు కఠిన శిక్ష విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పు వెలువరించింది. 195/2023 నంబరు కేసు, 04/2024 ప్రత్యేక మాదకద్రవ్య కేసులో మాదకద్రవ్యాల నియంత్రణ చట్టంలోని సెక్షన్ 8 (సి) తో పాటు 20 (బి)(2)(సి) ప్రకారం విచారణ జరిపి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 235 (2) ప్రకారం నిందితులను దోషులుగా తేల్చింది. ప్రతి నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 1,00,000 జరిమానా విధించింది. ఈ కేసులో మొదటి నిందితుడు కోలి రాజా వర్మ (23), మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖర్గోన్ జిల్లా నివాసి కాగా, రెండవ నిందితుడు నామ్‌దేవ్ సాహెబ్రావ్ పటేల్ (51), మహారాష్ట్ర రాష్ట్రం జల్గాం జిల్లా నివాసి. ఫిర్యాదుదారు జి. రాజ్‌కుమార్ (అప్పటి ఉప నిరీక్షకుడు, ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్; ప్రస్తుతం వరంగల్ నగర నేర శాఖ) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయబడింది. దర్యాప్తును ఎ. ప్రవీణ్ కుమార్, వృత్తి నిరీక్షకుడు సమర్థంగా నిర్వహించారు. ఈ కేసులో వాదనలు వినిపించిన ప్రభుత్వ న్యాయవాది బొలెద్ల రాజమల్ల రెడ్డి కృషి ప్రశంసనీయమైంది. న్యాయమూర్తి శ్రీమతి బి. అపర్ణాదేవి గారు తీర్పు వెలువరించారు.ప్రస్తుతం ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ వృత్తి నిరీక్షకుడు పులి రమేష్, ఉప నిరీక్షకుడు ఎ. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సమన్వయంతో కేసు విజయవంతమైంది. న్యాయస్థాన సంబంధాధికారి కె. పరమేశ్వరి, సిబ్బంది పి. అనూష సహకారం అందించారు. ఈ తీర్పుతో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

## తిమ్మాపూర్ గ్రామంలో గొరిల్లా వేషధారణతో కోతులను తరిమికొట్టిన ఐదవ వార్డ్ మెంబర్ ప్రకాష్ వినూత్న ప్రయత్నం



**మన వార్తా ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మండలం ఫిబ్రవరి:12** వార్డ్ లోని ప్రజలు కోతులతో తీవ్ర భయభ్రాంతులకు ఇబ్బందులకు గురి కావడంతో స్వయంగా ఐదో వార్డ్ మెంబర్ వార్డు ప్రజలతో కలిసి ఈ కార్యక్రమం మొదలుపెట్టారు..స్వయంగా తను గొరిల్లా వేషా దారానలో కోతులను తరిమే కార్యక్రమం చేపట్టారు, వారితోపాటు వార్డు లోనీ పలువురు ప్రజలు పాల్గొన్నారు ఈ కార్యక్రమం ఒక వారం రోజులు చేయడం ద్వారా గ్రామంలో నుంచి కోతులను నిర్మూలించవచ్చని అభిప్రాయపడ్డారు ఈ సందర్భంగా ఐదో వార్డ్ మెంబర్ ప్రకాష్,ని పలువురు వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు అభినందించారు

## వల్లాభపుర్ గ్రామ పంచాయతీ నూతన భవనానికి భూమి పూజ



**–గ్రామ అభివృద్ధే లక్ష్యం: సర్పంచ్ శ్వేత శ్రీనివాస్...**

**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 12 మన వార్త ప్రతినిధి**హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ శ్వేత శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్వేత శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సౌకర్యవంతమైన పంచాయతీ భవనం నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో అన్ని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిల్ కుమార్, వార్డు సభ్యులు రేణుక, కుమార్, శ్రీను, రాధ, కిషోర్, అరుణ, సునీత, నాగరాజు, ముక్క లావణ్యతో పాటు గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. భూమి పూజ అనంతరం గ్రామ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని గ్రామ పెద్దలు పిలుపునిచ్చారు.

## వాలీబల్ టీమ్ కు డ్రెస్ కోడ్ పంపిణి



**ములుగు పిబ్రవరి 12 మనవార్త** మంత్రివర్యులు సీతక్క తనయుడు కుంజా సూర్య ఆదేశాలతో కన్నాయిగూడెం మండల వాలీబాల్ టీంకు డ్రస్ కోడ్ పంపిణీ చేసినా బుట్టాయిగూడెం సర్పంచ్ జాడి రాంబాబు. బుట్టాయిగూడెం సర్పంచ్ జాడి రాంబాబు మాట్లాడుతూ మహారాష్ట్ర ముక్కిడి గుట్టలో జరుగుతున్న వాలీబాల్ టోర్నమెంట్ కు వెళుతున్న కన్నాయిగూడెం మండల వాలీబాల్ టీం కు అల్ ది బెస్ట్ తేలియజేసి మంచి విజయంతో తిరిగి రావాలని కోరారు. మండలంలోని యువతకు ఎటువంటి సమస్యలు ఉన్నా చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యం అని యువతకు ఎటువంటి స్పోర్ట్స్ వస్తువులు అవసరం అయినా యువనేత సూర్యకు తెలియజేసిన తన వంతుగా యువతను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తా అని తెలియజేసారు. అలాగే మారుమూలా ప్రాంతం అయినా కన్నాయిగూడెం మండలాన్ని యువనేత కుంజా సూర్య దత్తతుతీసుకోని యువతని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ కృషి పట్టుదల సర్పంచ్ జాడి రాంబాబు అన్నారు.

## సిరికొండ సర్పంచ్ మల్లెల సాయిచరణ్ ఆధ్వర్యంలో ఎలక్ట్రిసిటీ ఏఈ శేఖర్ కు వినతి పత్రం





**నిజామాబాద్ జిల్లా సిరికొండ( మన వార్త) ఫిబ్రవరి 12**సిరికొండ సర్పంచ్ మల్లెల సాయిచరణ్ గారి ఆధ్వర్యంలో సిరికొండ మండల కేంద్రంలో చాలా సంవత్సరాల నుంచి లో వోల్టేజ్ సమస్య,ఏాదీ కేబుల్ ఉన్నచోట థర్డ్ వైర్ బిగించుట పూర్తిగా ఇండ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న 33 కెవి కరెంటు లైన్ ఊరికి అవతల వైపు వేయుటకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కామారెడ్డి రోడ్డు చర్చి నుండి దొడ్ల వాగు వరకు రెండు వైపులా పోల్స్ వేస్తూ కరెంటు లైన్ వేయుటకు సిరికొండ ఎలక్ట్రిసిటీ ఏఈ శేఖర్ గారిని కలసి ఈ సమస్యలు అన్ని పరిష్కరించుటకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కనగందుల మురళి, చిట్యాల రంజిత్,బాదావత్ తిరుపతి , నాయకులు కొలిప్యాక సుమన్, బోల్గం శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో ప్రపంచ స్థాయి గుర్తింపు...



**పెబ్బేరు.ఫిబ్రవరి12 (మన వార్త ప్రతినిధి)**క్రీడలతో ప్రపంచ స్థాయి గుర్తింపును పొందవచ్చునని, మానసికోల్లాసం తో పాటు, దేహదారుఢ్యం సమకూరుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గోపాల్ పేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సీఎం క్రికెట్ క్రీడా పోటీలను గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రవ్యాప్తంగా క్రీడలకు ఎంతో ప్రాధాన్యత నిస్తోందని, క్రీడాకారులు ఈ సదా వకాశాన్ని వినియోగించుకుని గొప్ప క్రీడాకారులుగా పేరు తెచ్చుకోవాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గారు పేర్కొన్నారు. 80 కిలోమీటర్ల వేగంతో పరిగెత్తే జింకను, 60 కిలోమీటర్ల వేగంతో పరిగెత్తే పులి వేటాడి చంపుకుని తింటుందని జింక భయంతో వెనకకు చూస్తూ పరిగెత్తుతుండడంతో పులి సులభంగా జింకను పట్టుకుంటుందని విద్యార్థులు కూడా వారి లక్ష్యాన్ని నిర్ధారించుకొని ప్రత్యర్థులు ఎంత సమర్థులైన మీరు కూడా పులిలా లక్ష్యాన్ని చేరుకోవాలని ఎమ్మెల్యే సూచించారు

## మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కు ఏర్పాట్లు పూర్తి...



**పెబ్బేరు.ఫిబ్రవరి12 (మన వార్త ప్రతినిధి)**వనపర్తి జిల్లాలోని 5 మున్సిపాలిటీలకు సంబంధించి శుక్రవారం ఉదయం 8 గంటల నుండి ప్రారంభం కానున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం జిల్లా ఎన్నికల అథారిటీ వనపర్తి, అమర్చింత,ఆత్మకూరు,కొత్తకోట,పెబ్బేరు మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వనపర్తి జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో ఏ మున్సిపాలిటీకి అదే మున్సిపాలిటీ పరిధిలో లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ లెక్కింపు ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయడం జరిగిందని, మూడు అంచెల పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం వరకు అన్ని ఫలితాలు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లెక్కింపు కేంద్రాల్లో ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని,గుర్తింపు కార్డు లేని వ్యక్తులకు పోలింగ్ కేంద్రంలోకి అనుమతి లేదని తెలియజేశారు. ఎన్నికల అభ్యర్థితో పాటు ఒక ఏజెంట్ ను మాత్రమే లెక్కింపు కేంద్రంలోనికి అనుమతించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు, అధికారులు,సిబ్బంది అందరూ సహకరించించి కౌంటింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఆర్డీఓ సుబ్రమణ్యం,డీఎస్పీ వెంకటేశ్వర రావు,మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు,తహసిల్దార్ రమేష్ రెడ్డి ఇతర సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

## డిప్యూటీ తహసిల్దార్ లేక మండలంలో తీవ్రమైన ఇబ్బందులు..

**–ఈ పంచాయతీ ఆపరేటర్లు విధులు నిలిపివేత...**

**–నిధులు వినియోగం రాక సమస్య...**




**ఇల్లంతకుంట,ఫిబ్రవరి 12 (మన వార్తా ప్రతినిధి);**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో డిప్యూటీ తాహసిల్దార్ లేకుండా ఉండటం వల్ల ప్రజలు అవసరమైన సర్టిఫికెట్ల కోసం కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పంచాయతీ ఆపరేటర్లు తమ విధులు నిలిపివేయడం,గ్రామాల నిధులను వినియోగంలోకి తేవడంలో అంతరాయం కలిగించడం వల్ల సమస్య మరింత పెరుగుతోంది అని పొత్తూరు సర్పంచ్ పట్నం అశ్విని ఈ సందర్భంలో గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. “మా మండలం పేరుకే పెద్ద మండలమా...జిల్లాలోనే మా మండలంలోని ఎక్కువ గ్రామాలు ఉన్నాయి. అయినప్పటికీ డిప్యూటీ తాహసిల్దార్ లేకుండా ఉండటం,పంచాయతీ ఆపరేటర్లు విధులు నిలిపివేయడం వల్ల ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు రావడం లేదు. మిగతా మండలాల్లో అధికారులు సమస్యలను పరిష్కరించగలిగారు,కానీ ఇల్లంతకుంట మాత్రమే ఇబ్బందిలో ఉంది,”అని తెలిపారు. అంతేకాక,పంచాయతీ నిధులను ఖర్చు చేయకపోవడం వల్ల కొత్త నిధులు కూడా జమ అవ్వడంలో ఆలస్యం అవుతోంది అని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేస్తూ,జిల్లా ఉన్నతాధికారులు వెంటనే ఇల్లంతకుంట మండలంపై దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## పడకల్ గ్రామ ప్రజలకు మొదటి గ్రామ సభలోనే వరాలు ప్రకటించిన సర్పంచ్



**కల్వకుర్తి.ఫిబ్రవరి 12 మన వార్త ప్రతినిధి** తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి తలకొండ పల్లి మండలం పడకల్ గ్రామం లో గ్రామపంచాయతీ ఆవరణ లో మొదటి గ్రామ సభ సర్పంచ్ డోకురి సునీత ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ సభలో తీర్మానం చేసి గ్రామ ప్రజలకు 5 సంవత్సరాలు ఇంటి ట్యాక్స్ ,నల్ల బిల్ గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి తన సొంత డబ్బులతో, ఇంటి ట్యాక్స్ , నల్లబిల్ కడుతము,అని 1,50,000 ఒక లక్ష యాభై వేలు రూపాయలో చెక్కును మండల పంచాయతీరాజ్ అధికారి లక్పతి నాయక్, గ్రామపంచాయతీ సెక్రెటరీ మంద కుమార్ కి గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ జినుకుంట్ల రాఘవేందర్ వార్డు సభ్యులు జోగు విజయ్, జిల్లెల్ల సువాసిని, లట్టుపల్లి వసంత రంగారెడ్డి, అబ్దుల్ వాజిద్, బురిగళ్ళ రాధిక రమేష్, బండగాళ్ల చెందు, చెవిటి విమలమ్మ, జనిగే నర్సింహ, చెవిటి విజయ్, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

## ఓటర్ ను అభినందించిన కమీషనర్..



**జమ్మికుంట, ఫిబ్రవరి 12( మన వార్త ప్రతినిధి ):**లండన్ నుండి వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్ ను మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ అభినందించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం పై ఉన్న నమ్మకంతో లండన్ నుంచి చిన్నారితో వచ్చి జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన కొక్కుల కేదారేశ్వర్ శ్రీలత– దంపతుల కుమార్తె మాధురిని మున్సిపల్ కమిషనర్ ఎండీ. ఆయాజ్ అభినందించారు. చిన్నారి కూతురుతో సుదూర ప్రాంతం నుంచి వచ్చి ఓటేసిన మాధురిని సన్మానించి అభినందించారు.

## క్వింటాల్ పత్తి గరిష్ఠ ధర రూ, 7450..



**జమ్మికుంట,ఫిబ్రవరి 12( మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తికి గురువారం రూ 7,450 పలికింది. 37 వాహనాలలో 300 క్వింటాల విడి పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. మోడల్ ధర రూ 7,300, కనిష్ట ధర రూ. 6300 లకు వ్యాపారస్తులు కొనుగోలు చేసినట్లు మార్కెట్ సెక్రెటరీ రాజా తెలిపారు.

## మృతురాలి కుటుంబాన్ని ఓదార్చి అభినందించిన కమీషనర్



**జమ్మికుంట, ఫిబ్రవరి 12( మన వార్త ప్రతినిధి):**తల్లి మృతి చెందిన దుఃఖంతో ఉండి ఓట్లేసిన కుటుంబీకులను మున్సిపల్ కమిషనర్ అభినందించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన రజిబి(80) మృతి చెందినా దుఃఖాన్ని దిగమింది కుటుంబీకులు ఓటు వేయడాన్ని మున్సిపల్ కమిషనర్ ఎండీ. అయాజ్ ఈరోజు అభినందించారు. తల్లి అంత్యక్రియలు కాకముందే ఓటు వేసిన మృతురాలి కొడుకు ఇస్మాయిల్, భార్య షబానా కూతురు సనను అభినందించారు. తల్లి మృతితో విషాదంలో ఉన్న కుటుంబాన్ని ఓదార్చారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను విజయవంతం చేయాలి



**వేములవాడ ఫిబ్రవరి 12 (మన వార్త)**వేములవాడ పట్టణంలో ఈ నెల 16 నుండి 19 వరకు వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సౌజన్యంతో రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్(మెన్ మరియు వుమెన్) పోటీలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిర్వాహకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.. వారు మాట్లాడుతూ క్రీడల పట్ల ప్రతి ఒక్కరు పెంచుకోవాలని, క్రీడలు ఆడడం పట్ల శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసము ఉంటుందని పేర్కొన్నారు..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో క్రీడలకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు.. సీఎం కప్ పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు చేన్నమనేని శ్రీ కుమార్, ఉపాధ్యక్షులు కోళ్ల శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి అజ్మీర రాందాస్, ఈసీ నెంబర్ మైలారం తిరుపతి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు..

## మహిళ అదృశ్యం కేసు నమోదు..



**జమ్మికుంట, ఫిబ్రవరి 12( మన వార్త ప్రతినిధి ):**ఇంటిలో గొడవపడి వెళ్లిపోయిన మహిళా భర్త ఫిర్యాదుతో అదృష్టం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రామకృష్ణ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం జమ్మికుంట పట్టణంలోని మోత్కులగూడెం కు చెందిన దున్నపోతుల సంపత్11 సంవత్సరాల క్రితం మహేశ్వరి అనే మహిళ తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లల వున్నారు. ఈనెల 5 వ తేదీన ఉదయం తన భార్యతో గొడవపడి తర్వాత తను కూలి పనికి వెళ్లిపోయాడు పని ముగించుకొని తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తన భార్య ఇంటిలో లేకపోవడంతో చుట్టుపక్కల వారిని, బంధుమిత్రుల వద్ద ఆచూకీతెలవలేదని ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ర్యాలీలకు,సంబరాలకు అనుమతి లేదు..



**జమ్మికుంట, ఫిబ్రవరి 12( మన వార్త ప్రతినిధి):**ఎన్నికల లెక్కింపు సందర్భంగా పట్టణంలో ఎన్నికల కోడ్ అమలులో వున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణ తెలిపారు. గెలుపొందిన అభ్యర్థులు ఎలాంటి ర్యాలీలు,సంబరాలు చేయరాదని హెచ్చరించారు. సంబరాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిపి ఆదేశాల మేరకు కౌంటింగ్ కు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనికి ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

# పదవ తరగతి ఇంగ్లీష్ లో

## ఎక్కువ మార్కులు రావాలంటే



పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నకొద్దీ విద్యార్థులకు మార్కుల విషయంలో ఆందోళన కలగటం సహజం. అందులో ఇంగ్లిష్ విషయంలో ఇంకాస్త ఎక్కువే ఉంటుంది. కానీ కంగారు పడకుండా ఈ సూచనలు పాటిస్తే ఎక్కువమార్కులు సులభంగా సంపాదించవచ్చు. పాఠ్యపుస్తకం లోని ఎనిమిది యూనిట్లలో 'A ' రీడింగ్ లను క్షున్నంగా చదవాలి. మరియు ఏ పాఠం లోనుండి మేజర్ డిస్కోర్స్ (పది మార్కులు) మరియు మైనర్ డిస్కోర్స్ (అయిదు మార్కులు) వస్తుందో మీ సబ్జెక్టు టీచర్ ద్వారా తెలుసుకొని అటువంటివి మాత్రమే ప్రిపేర్ అయితే సరిపోతుంది. ఉదాహరణకు మొదటి యూనిట్ నుండి **Attitude is Altitude qT+&• Nick** కు సంబంధించి ఒక **conversation, interview, diary writing** వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే **Dear Deparated-I** నుండి **conversation, skit, diary writiang** వచ్చే అవకాశాలుంటాయి. అలాగే **A Readings** ను బాగా చదవడం వాళ్ళ మొదటి బిట్ లో పన్నెండు మార్కులు, గ్రామర్ కు సంబందించిన అంశాలు కూడా **A Reading** ప్రాధాన్యతతో ఉంటాయి కనుక మరో ఎనిమిది మార్కులు, ఎడిటింగ్ కు సంబంధించి ఐదు మార్కులు సంపాదించవచ్చు. అంటే ఆ రీడింగ్ ఇరవై ఐదు (25) మార్కుల ప్రాధాన్యత కలిగి ఉందని చెప్పవచ్చు. పరీక్ష పత్రంలో మొదటి మూడు బిట్స్ రీడింగ్ కు సంబంధించినవే. **A Reading** మరియు **B Reading** లకు సంబందించిన ప్రశ్నలకు కనీసం మూడు వాక్యాలు మరియు అంతకన్నా ఎక్కువగా సమాధానము రాయాల్సి ఉంటుంది. ఒక ప్రశ్నలో అంతర్గతంగా మరో ప్రశ్న లేదా ఒక్కోసారి రెండు ప్రశ్నలను కలిగి ఉంటాయి కనుక. ప్రశ్నలను జాగ్రత్తగా గమనిస్తే సగం సమాధానం మీ ప్రశ్న నుండే రాయవచ్చు. గ్రామర్ తప్పులగురించి ఎక్కువగా భయపడవద్దు. ఎదుకంటే ఒకటి లేదా అర మార్కుకన్నా ఎక్కువగా కట్ చేయరు గనుక. స్వల్ప సమాధాన ప్రశ్నలు గనుక పేరాగ్రాఫ్ గా మాత్రమే రాయాలి. పాయింట్స్ వాయిస్ గా రాయకూడదు. మూడవ రీడింగ్ స్టడీ స్కిల్స్ గురించి. ఈ స్టడీ స్కిల్స్ అన్ని **8th , 9th** మరియు **10th** క్లాసుల పాఠాల వెనుక ఉన్న నమూనాల నుండి మాత్రమే వస్తాయి. టేబుల్ ఫారం, పై చార్ట్ , ట్రీ చార్ట్ , ఫ్లో చార్ట్, బార్ గ్రాఫ్ మొదలగునవి ఉంటాయి. ప్రశ్నలు సులభంగానే ఉంటాయి కానీ జాగ్రత్తగా చదవాలి ఒకటికి రెండుసార్లు. ఎందుకంటే పోల్చడం, సరి చూడటం, అవగాహనా చేస్కోవడం, అంచనా వేయడం అనే విషయాల ఆధారంగా ప్రశ్నలుంటాయి. తొందరపడకుండా జాగ్రత్తగా రాయాలి. అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు కాబట్టి ఒకటి లేదా రెండు వాక్యాలు మించకుండా రాయాలి. ఏ బిట్ ప్రశ్నలు ఆ బిట్ లోనే వరుసగా రాయడం వలన సరైన మార్కులు పొందవచ్చు. తదుపరి బిట్ (13 వ ప్రశ్న ) గ్రామర్ కు సంబందించినది. ఆరు ప్రశ్నలకు గాను నాలుగు రాయాల్సి ఉంటుంది. కానీ అన్ని ప్రశ్నలకు సమాధానం రాయడం మంచిది ఎందుకంటే ఏ సమాధానం లోనైనా తప్పులు దొర్లినట్టైతే మరొకటి కరెక్ట్ కావొచ్చు. ముఖ్యముగా **Active Voice-Passive Voice, Reported Speech, Question tags. Combine the sentences** కు సంబంధించి ఉంటాయి. **9th 10th** క్లాసుల గ్రామర్ ను చూసుకుంటే అందులోనుండి మాత్రమే వస్తాయి. మేజర్ డిస్కోర్స్ పది మార్కులు గనుక ఒకసారి బుక్లెట్ చివరి పేజీలో రఫ్ గా ప్రాక్టీస్ చేసుకోవడానికి అవకాశం ఉంది. ముందుగా ప్రాక్టీస్ చేసిన దానిని చూసి గమనిస్తూ రాయడం వల్ల తప్పులు తగ్గే అవకాశం ఉంది. ప్రశ్నకు సంబంధించి హింట్స్ ఇవ్వడం జరుగుతుంది. వాటిని అనుసరిస్తూనే సమాధానం రాయాలి. ఎక్కువగా **intereview, coversation, Drama Script, choreography** మరియు **narration** వచ్చే అవకాశం ఉన్నందున పాఠాల్లోని ఆ డిస్కోర్స్ ను ప్రాక్టీస్ చేయడం మంచిది. మనం చదువుకున్న పాటలనుండి ఈ ప్రశ్న కావున తప్పకుండ ఎక్కువ సమాచారం రాయవచ్చు, అలాగే మంచి మార్కులు పొందవచ్చు. అలాగే **Biography, Essay, Letter, News Report, Speech** ప్రశ్నలు పాఠ్య పుస్తకం నుండి కాకుండా బయటనుండి వస్తాయి. 15 వ ప్రశ్నగా **Diary writing** మరియు **Notice** వచ్చే అవకాశం ఎక్కువ. ఇవి ఎక్కువగా ఆ రేడయింగ్ నుండి వచ్చే అవకాశం ఉన్నందున ుపఞఎశీశీ చదవడం వల్ల మనం అనుకున్న ప్రశ్నలే రావడం జరుగుతుంది. **Dairy writing, Notice** రాసేటప్పుడు ప్రశ్నలో ఇచ్చిన హింట్స్ తప్పకుండ చదివి వాటికీ అనుగుణంగానే సమాధానం రాయాలి. సమాధానానికి అవుట్ లైన్ గీయడం తప్పనిసరి. 16 వ ప్రశ్నగా ముఖ్యముగా **poster, profile** మరియు **invitation** రావడం జరుగుతుంది. వీటికి కూడా హింట్స్ ను చూసి సమాధానం రాయాలి. పోస్టర్ కు కలర్ పెన్సిల్స్ మరియు వాక్స్ పెన్సిల్స్ ఉపయోగించవచ్చు. అందమైన బార్డర్ **poster** మరియు **invitation"** తప్పనిసరి. పోస్టర్ టైటిల్ కాపిటల్ లెటర్స్ లో మరియు పెద్ద సైజు లో రాయాలి. ఈ ప్రశ్న పాఠ్య పుస్తకం నుండి కాకుండా బయటనుండి వస్తుంది. పార్టు బి రాసేటప్పుడు ఎటువంటి కొట్టివేతలు చేయరాదు మరియు సమాధానాన్ని పెన్సిల్ తో రాయడం , పెన్నుతో రాసింది దిద్దడం గని చేయరాదు. (17-21) ముందుగా పద్యాన్ని ఒకటికి రెండుసార్లు చదివి ముఖ్యమైన పదాలను అండర్ లైన్ చేసుకోవాలి. తదుపరి ప్రశ్నలు చదివితే సులభంగా అర్థం అవుతాయి. ఎందుకంటే ఈ పద్యం టెక్స్ట్ బుక్ నుండి రాదు, బయట నుండి ఇస్తారు గనుక. ఒక్క **Figures of Speech** ప్రశ్న తప్ప మిగతా ప్రశ్నలు అవగాహన మరియు అర్థం అడగటం గురించే ఉంటాయి. **Figures of Speech** ప్రశ్న కూడా **Simile, Personification** మరియు **Metaphor** గురించి వచ్చే అవకాశాలు ఎక్కువ .22-26 **error correction** చేసినప్పుడు ఆ వాక్యాన్ని మొత్తం రాయాలి. **verb forms, articles, prepositions, spelling mistakes word order** గురించి ఎక్కువగా అడగటం జరుగుతుంది. టెక్స్ట్ బుక్ చదవడం వల్ల ఈజీ గా చేయవచ్చు. ముఖ్యంగా **paragraph @ tense** లో ఉన్నది, **Speaker mesÁT, Gender** ఏమిటి అని తెలిస్తే ఆన్సర్స్ ఈజీ గా చేయవచ్చు. 27-31 ప్రశ్నలు కూడా పై ప్రశ్నల మాదిరిగానే. కాకపోతే వీటికి మనకు **A,B,C, D** అని నాలుగు **options** ఇస్తారు. ఇక సూచనలు పై ప్రశ్నల మాదిరిగానే ప్రిపేర్ కావాలి. ఈ ప్రశ్న పాఠ్య పుస్తకం నుండి కాకుండా బయటనుండి వస్తుంది. 32-36 ప్రశ్నలు పేరాగ్రాఫ్ లో ఒక పదాన్ని అండర్ లైన్ చేసి అందుకు సంబందించిన ప్రశ్నలు అడుగుతారు. **Meanings (synonyms), Opposite words (antonyms), Homonyms or Homophones, Subject and Verb agreement, spelling mistakes** గురించి ప్రశ్నలు ఉంటాయి. ఈ బిట్ కూడా టెక్స్ట్ బుక్ నుండి వస్తుంది. కావున పై సూచనలు పాటించి , సమాధాన పత్రాన్ని రాసిన తర్వాత ఒకటికి రెండు సార్లు చెక్ చేస్కొని ఇవ్వాలి. ఇలా చేయడం వల్ల దోష రహిత సమాధాన పత్రాన్ని మనం ఇవ్వగలం.



– దిడ్డి సతీష్
స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్ )
ఇంగ్లిష్ రిసోర్స్ పర్సన్
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్యాల ,
పెద్దపల్లి జిల్లా .

## ప్రపంచవ్యాప్తంగా లక్షల కార్లను రీకాల్ చేసిన బీఎండబ్ల్యూ.. కారణం ఇదే





**బెర్లిన్** జర్మనీకి చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ (BMW) ప్రపంచవ్యాప్తంగా లక్షల సంఖ్యలో కార్లను రీకాల్ చేసింది. ఇంజిన్ స్టార్టర్ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా మంటలు చెలరేగే ప్రమాదం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. 2020 నుంచి 2022 మధ్య ఉత్పత్తి చేసిన సుమారు 16 మోడళ్లలో ఈ సమస్య ఉన్నట్లు కంపెనీ తెలిపింది. మొత్తం మీద దాదాపు 5.75 లక్షల వాహనాలు ఈ రీకాల్ పరిధిలోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. ఉత్పత్తి తనిఖీలు, వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా స్టార్టర్ మోటార్ వ్యవస్థలో లోపాలు ఉన్నట్లు గుర్తించినట్లు బీఎండబ్ల్యూ వెల్లడించింది. ప్రత్యేకంగా స్టార్టర్‌లో ఉన్న మాగ్నెటిక్ స్విచ్‌లు ఎక్కువసార్లు వాహనం స్టార్ట్ చేయడానికి ప్రయత్నించినప్పుడు అరిగిపోవడంతో కారు స్టార్ట్ కావడంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది. కొన్ని సందర్భాల్లో ఈ లోపం కారణంగా వాహనంలో మంటలు చెలరేగే ప్రమాదం కూడా ఉన్నట్లు పేర్కొంది. ఈ సమస్యకు పరిష్కారం కోసం ప్రభావిత వాహనాలను ఉచితంగా తనిఖీ చేసి అవసరమైన భాగాలను మార్చివేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. రీకాల్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత దేశాల్లోని డీలర్‌షిప్‌ల ద్వారా వాహన యజమానులకు తెలియజేస్తున్నట్లు బీఎండబ్ల్యూ తెలిపింది.

## బంగారం కిందకు వెండి పైకి..




**హైదరాబాద్** గత కొన్ని రోజులుగా స్థిరంగా కొనసాగిన బంగారం ధరలు గురువారం తగ్గుముఖం పట్టాయి. మరోవైపు ఇటీవల వరుసగా తగ్గుతూ వచ్చిన వెండి ధరలు మళ్లీ పెరిగాయి. బంగారం ధర గ్రాముకు సుమారు రూ. 1200 వరకు తగ్గగా.. వెండి కిలోకు రూ. 5000 మేర పెరిగింది. ఫిబ్రవరి 12 ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,58,400గా నమోదైంది. ఇది నిన్నటి ధరతో పోలిస్తే రూ. 1200 తక్కువ. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,45,200గా ఉండగా, ఇది రూ. 1100 తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,58,550గా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,45,350గా కొనసాగుతోంది. ఇక వెండి ధరలు గణనీయంగా పెరిగాయి. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ. 3 లక్షలకు చేరుకుంది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 2.95 లక్షలుగా ఉంది. నిన్నటి ధరతో పోలిస్తే వెండి కిలోకు సుమారు రూ. 5000 పెరుగుదల నమోదైంది. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్ మార్పులు, డాలర్ మారకం విలువ, డిమాండ్ వంటి అంశాలపై ఆధారపడి తరచూ మారుతుంటాయి. కాబట్టి కొనుగోలు చేసే ముందు తాజా ధరలు తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## స్టాక్ మార్కెట్‌లకు షాకిచ్చిన ఐటీ..



**ముంబై** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ నష్టాలతో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మార్కెట్‌లపై తీవ్ర ప్రభావం పడింది. అమెరికాలో జనవరి నెలకు సంబంధించిన అంచనాల కంటే మెరుగైన జాబ్స్ డేటా వెలువడడంతో.. ఫెడరల్ రిజర్వ్ త్వరలో వడ్డీ రేట్లు తగ్గించే అవకాశాలు తగ్గాయని భావించిన మదుపర్లు అమ్మకాల వైపు మొగ్గుచూపారు. దీనికి తోడు ఐటీ రంగాన్ని ఏఐ ప్రభావం మరియు భవిష్యత్ ఆర్డర్లపై ఉన్న అనిశ్చితి వెంటాడింది. ఇటీవల గరిష్ఠ స్థాయిల వద్ద ట్రేడ్ అవుతున్న ఐటీ స్టాక్స్‌లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం కూడా సూచీల పతనానికి కారణమైంది. ఫెడ్ వడ్డీ రేట్లు ఎక్కువ కాలం కొనసాగితే అమెరికన్ కంపెనీలు ఖర్చులను తగ్గించే అవకాశం ఉండటంతో భారత ఐటీ సంస్థలపై ఒత్తిడి పెరుగుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో వంటి ప్రముఖ ఐటీ కంపెనీల షేర్లు గణనీయంగా పడిపోయాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 5 శాతం మేర క్షీణించింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ. 3 లక్షల కోట్లు తగ్గినట్లు అంచనా. సెన్సెక్స్ గురువారం 83,968.43 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమై రోజంతా ఒత్తిడిలోనే కొనసాగింది. ఇంట్రాడేలో 83,516.67 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 558.72 పాయింట్లు కోల్పోయి 83,674.92 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 146.65 పాయింట్ల నష్టంతో 25,807.20 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 90.61 వద్ద కొనసాగింది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, బీఈఎల్, ఎస్‌బీఐ షేర్లు లాభాల్లో నిలిచాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్ల వద్ద ఉండగా, బంగారం ఔన్సు ధర 5064 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది.

## రూ. 7,499కే లావా యువ స్టార్ 3 విడుదల...




**న్యూఢిల్లీ** తక్కువ ధరలో మెరుగైన సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో లావా సంస్థ సరికొత్త యువ స్టార్ 3 మొబైల్‌ను భారత మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ కాలం పనిచేసే బ్యాటరీ, పెద్ద తెర, సరిపడ పనితీరు కోరుకునే వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని ఈ మొబైల్‌ను రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ఈ మొబైల్‌లో 6.75 అంగుళాల పరిమాణం గల స్పష్టమైన ప్రదర్శన తెరను అమర్చారు. తెర మరింత సాఫీగా పనిచేయడానికి అధిక తాజాకరణ వేగం అందించారు. శక్తివంతమైన ప్రాసెసర్‌తో ఇది రోజువారీ వినియోగానికి అనుకూలంగా పనిచేస్తుందని కంపెనీ పేర్కొంది. మెమరీ పరంగా 4 జీబీ పని సామర్థ్య జ్ఞాపకశక్తి, 64 జీబీ నిల్వ సామర్థ్యం అందించారు. తాజా ఆండ్రాయిడ్ ఆధారిత నిర్వహణ వ్యవస్థపై ఈ మొబైల్ పనిచేస్తుంది. చిత్రీకరణ కోసం వెనుక భాగంలో 13 మెగా పిక్సెల్ ప్రధాన కెమెరా, ముందు భాగంలో 5 మెగా పిక్సెల్ కెమెరా ఏర్పాటు చేశారు. ఎక్కువ సమయం ఉపయోగించుకునేలా 5000 ఎంఏహెచ్ సామర్థ్యమున్న బ్యాటరీను అందించారు. దుమ్ము, నీటి చిమ్మర్ల నుండి రక్షణ కల్పించే సౌకర్యంతో పాటు భద్రత కోసం పక్క భాగంలో వేలిముద్ర గుర్తింపు వ్యవస్థను ఏర్పాటు చేశారు. భారతదేశంలో ఈ మొబైల్ ధర రూ. 7,499గా నిర్ణయించగా, మార్చి 2026 నుంచి దేశవ్యాప్తంగా ప్రముఖ విక్రయ కేంద్రాల్లో అందుబాటులోకి రానుంది.

## 70వ సౌత్ ఫిలింఫేర్ అవార్డ్స్ నామినేషన్లు...



**హైదరాబాద్,** చిత్ర పరిశ్రమలో నటీనటుల ప్రతిభను గుర్తిస్తూ ప్రతిష్టాత్మకంగా అందించే ఫిలింఫేర్ అవార్డ్స్‌కు సినీ ప్రియుల్లో ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ప్రతి సంవత్సరం ఈ అవార్డుల కోసం ప్రేక్షకులు, సినీ తారలు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఈ నేపథ్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన 70వ సౌత్ ఫిలింఫేర్ అవార్డ్స్ నామినేషన్ల జాబితాను నిర్వాహకులు తాజాగా విడుదల చేశారు. ఈ జాబితాలో తెలుగు సినిమాలు గణనీయమైన స్థానం సంపాదించడం టాలీవుడ్‌కు మరోసారి గౌరవాన్ని తీసుకువచ్చింది. దక్షిణాది చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మక వేడుకలలో ఒకటిగా భావించే ఫిలింఫేర్ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఈ నెల ఫిబ్రవరి 21న ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల చిత్రాలు వివిధ విభాగాల్లో పోటీపడుతున్నాయి. ముఖ్యంగా 2024లో విడుదలైన చిత్రాలను పరిశీలించి ఈ ఏడాది నామినేషన్లను ప్రకటించారు. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ దర్శకుడు, సంగీతం, ఛాయాగ్రహణం వంటి పలు విభాగాల్లో నామినేషన్లు ఉండగా, తెలుగు సినిమాలకు విశేష ప్రాధాన్యం దక్కడం ప్రత్యేకంగా నిలిచింది. ఉత్తమ చిత్రం నామినేషన్లు:అనుపమ పరమేశ్వరన్ (టిల్లు స్క్వేర్), ఆషికా రంగనాథ్ (నా సామిరంగ), మీనాక్షి చౌదరి (లక్కీ భాస్కర్), నివేదా థామస్ (35 చిన్న కథ కాదు), ప్రియాంక మోహన్ (సరిపోదా శనివారం), రష్మిక (పుష్ప : ది రూల్). ఉత్తమ సహాయ నటుడు నామినేషన్లు:అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ఏడీ), ధనంజయ్ (జీబ్రా), ఫహద్ ఫాజిల్ (పుష్ప : ది రూల్), సత్య (మత్తు వదలరా 2), ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం), వినయ్ రాయ్ (హనుమాన్). ఉత్తమ సహాయ నటి నామినేషన్లు:అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి), ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2), రషి సింగ్ నందు (ప్రసన్నవదనం), శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజీ బ్యాండు), శ్రద్ధా శ్రీనాథ్ (మెకానిక్ రాకీ), వరలక్ష్మి శరత్‌కుమార్ (హనుమాన్). ఈసారి నామినేషన్లలో తెలుగు చిత్రాల ఆధిపత్యం కనిపించడం టాలీవుడ్ ప్రస్థానానికి మరో మైలురాయిగా సినీ వర్గాలు భావిస్తున్నాయి. అవార్డుల ఫలితాలపై ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

## తండ్రి రహస్య వ్యాపారం సుహాస్‌కు తిప్పలు!




**హైదరాబాద్,** వైవిధ్యమైన కథలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో సుహాస్, తాజాగా 'హే భగవాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ సినిమా ఫిబ్రవరి 20న విడుదల కానుండగా, తాజాగా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ట్రైలర్‌ను బట్టి చూస్తే.. సీనియర్ నటుడు నరేష్ తన కుటుంబ వ్యాపారాన్ని రహస్యంగా నిర్వహిస్తూ ఉంటారు. ఆ వ్యాపారం గురించి ఎవరికి తెలియకూడదనే కఠిన నిబంధన ఉంటుంది. అయితే తండ్రి వ్యాపారాన్ని స్వీకరించాలని సుహాస్ భావిస్తాడు. ఈ క్రమంలో అతను ఎదుర్కొనే అనూహ్య పరిణామాలు, హాస్యభరిత సంఘటనలు కథలో ప్రధానాంశంగా కనిపిస్తున్నాయి. తండ్రి--కొడుకు మధ్య సాగే సంఘర్షణను వినోదాత్మకంగా చూపించడంతో పాటు, భావోద్వేగానికి కూడా చోటు కల్పించినట్లు ట్రైలర్ సూచిస్తోంది. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' తర్వాత సుహాస్ మరియు శివానీ నాగారం మరోసారి జోడీ కట్టడం ఈ చిత్రంపై అంచనాలను పెంచుతోంది. దర్శకుడు గోపీ అచ్చర ఈ చిత్రాన్ని పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించగా, క్లైమాక్స్‌లో హృదయాన్ని హత్తుకునే ఎమోషనల్ టచ్ ఉంటుందని తెలిపారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని త్రిశూల్ విజనరీ స్టూడియోస్ నిర్మించింది. బన్నీ వాస్, వంశీ నందిపాటి సంయుక్తంగా విడుదల చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'హే భగవాన్' చిత్రం ఫిబ్రవరి 20న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ట్రైలర్‌తోనే ఆసక్తి రేకెత్తించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

## 116 పరుగులకే కుప్పకూలిన నమీబియా

# భారత్ ఘన విజయం



నమీబియాపై టీమిండియా ఘన విజయం సాధించింది. టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా జరిగిన మ్యాచ్ లో భారత్ ఆల్ రౌండ్ షోతో అదరగొట్టింది. దీంతో ఈ మెగా టోర్నీలో రెండో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. 210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నమీబియా 18.2 ఓవర్లలో 116 పరుగులకే కుప్పకూలింది. దీంతో నమీబియాపై 93 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి మూడు వికెట్లు పడగొట్టగా.. హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ రెండు వికెట్లు తీయగా.. దూబె, బుమ్రా, హర్షదీప్ లు తలో వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 9 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (61, 24 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సులు), హార్దిక్ పాండ్యా(52, 28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు) భారీ షాట్లతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడారు.

## 105 రన్స్ తేడాతో శ్రీలంక గ్రాండ్ విక్టరీ



**పల్లెకెలె** టీ20 వరల్డ్‌కప్‌లో శ్రీలంక జట్టు అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. ఇవాళ ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 105 రన్స్ తేడాతో ఘన విజయం సాధించి టోర్నీలో తమ రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్ బీ మ్యాచ్‌గా జరిగిన ఈ పోరులో లంక బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణించారు. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి భారీగా 225 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు దూకుడుగా ఆడుతూ ఒమన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. కుశాల్ మెండిస్ 45 బంతుల్లో 61 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశారు. అనంతరం కెప్టెన్ దసున్ శనక కేవలం 20 బంతుల్లోనే 50 పరుగులు చేసి మెరుపు హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. పవన్ రత్ననాయకే కూడా 28 బంతుల్లో 60 పరుగులు చేసి స్కోరు 200 దాటేలా చేశాడు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్ జట్టు శ్రీలంక బౌలర్ల దాడికి తట్టుకోలేకపోయింది. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి కేవలం 120 పరుగులు మాత్రమే చేసింది. ఒమన్ తరఫున నదీమ్ 53 పరుగులతో పోరాడగా, వాసిమ్ అలీ 27 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో దుష్మంత చమీరా, మహేశ్ తీక్షణ చెరో రెండు వికెట్లు తీసుకుని ఒమన్ బ్యాటింగ్ లైనప్‌ను కుదేలు చేశారు. మిగతా బౌలర్లు కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థికి అవకాశం ఇవ్వలేదు. ఈ విజయంతో శ్రీలంక గ్రూప్ బీ పాయింట్ల పట్టికలో బలమైన స్థానాన్ని సంపాదించింది. వరుసగా రెండో విజయం నమోదు చేయడంతో జట్టు ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com